విలక్షణం... ఈ భగీరథ వృత్తాంతం



'కృత్తివాస రామాయణం' బెంగాలీలో కృత్తివాస ఓఝా రచించిన కావ్యం. ఆయన క్రీస్తుశకం పదిహేనో శతాబ్దానికి చెందిన కవి, పండితుడు. ఈ కావ్యాన్ని 'శ్రీరామా పాచాలీ' (పాకాలీ) అని కూడా పిలుస్తారు. దీన్ని 'గంగానదీ లోయ ప్రాంత బైబిల్'గా బెంగాలీ రచయిత, పరిశోధకుడు దినేశ్ చంద్రసేన్ అభివర్ణించారు. ఆధునిక బెంగాలీ సాహిత్యానికి పూర్వ యుగంలో... అత్యంత ప్రచారం పొందిన కావ్యంగా కృత్తివాస రామాయణాన్ని విమర్శకులు పరిగణిస్తారు. ఇందులో వర్ణితమైన భగీరథుడి కథ విలక్షణమైనది, వేరెక్కడా కనిపించనిది.

కృత్తివాస రామాయణం ప్రకారం... నాలుగు అంశలుగా ఉద్భవించాలని నారాయణుడు కోరుకున్నాడు. ఆ ప్రకారం ఆయన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులుగా మారిపోయాడు. లక్ష్మీదేవి నారాయణుడికి ఎడమవైపు సీతగా ప్రత్యక్షమయింది. అదే సమయంలో... నారాయణ మంత్రం జపిస్తూ వైకుంఠానికి వచ్చిన నారదుడు... ఆ అద్భుత దృశ్యాన్ని చూసి పరమానందభరితుడయ్యాడు. నారాయణుడి ప్రతి లీల వెనుకా ఒక రహస్యం ఉంటుందనే సంగతి నారదుడికి బాగా తెలుసు. 'ఈ నాలుగు రూపాల వెనుక ఉన్న రహస్యం ఏమై ఉంటుంది?' అని ఆలోచించాడు. కానీ ఆ కారణమేమిటో నారదుడికి అంతుపట్టలేదు. 'నాకు తెలియకపోతేనేం? ఆ ముక్కంటికి తెలిసే ఉంటుంది' అనుకుంటూ నేరుగా కైలాసానికి చేరుకున్నాడు. తనతోపాటు తన తండ్రి బ్రహ్మను కూడా తీసుకువెళ్ళాడు. వారిద్దరినీ చూసి ప్రసన్నుడైన శివుడు... "మీ రాకకు కారణమేమిటి?" అని అడిగాడు. వైకుంఠంలో తను చూసిన దృశ్యాన్ని నారదుడు వివరించాడు. ఒక అంశ నాలుగు అంశలుగా ఎలా మారిందో తెలియజేయమన్నాడు. శంకరుడు చిరునవ్వు చిందిస్తూ "అరవై వేల ఏళ్ళ తరువాత... త్రేతాయుగంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం నారాయణుడు రఘు వంశంలో దశరథుడి పెద్ద కుమారునిగా జన్మిస్తాడు. రావణాది రాక్షసులను సంహరించడానికి అవతరిస్తాడు. ఆ దృశ్యాన్నే నువ్వు ముందుగా చూశావు" అని చెప్పాడు. సగరుడి మునిమనుమడైన దిలీపుడు సంతానహీనుడిగా స్వర్గస్థుడవడం, భగీరథుడి జననం... శంకరుని ఈ భవిష్యవాణితో ముడిపడి ఉంది.

రఘువంశానికి చెందిన, అయోధ్యకు రాజైన సగరుడు అశ్వమేధ యాగాన్ని చేపట్టాడు. యజ్ఞాశ్వాన్ని ఇంద్రుడు తరలించుకుపోయి... పాతాళంలో ఉన్న కపిల మహర్షి ఆశ్రమంలో కట్టిపడేశాడు. సగరుడి ఆదేశంతో అతని అరవైవేల మంది కుమారులు యజ్ఞాశ్వాన్ని వెతుకుతూ... భూమిని తవ్వి పాతాళానికి చేరుకుంటారు. కపిల మహర్షి ఆశ్రమంలో కట్టేసి ఉన్న యజ్ఞాశ్వాన్ని చూసి, దాన్ని కపిలుడే దొంగిలించాడనుకొని, ఆయనను నిందిస్తారు. ఆ మహర్షి కోపాగ్నికి భస్మమైపోతారు. వారితో పాటు యజ్ఞాశ్వాన్ని వెతికి తెమ్మని తన పెద్దకొడుకైన అసమంజసుణ్ణి సగరుడు ఆదేశిస్తాడు. అన్ని చోట్లా గాలిస్తున్న అసమంజసుడు పాతాళంలోని కపిల మహర్షి ఆశ్రమానికి చేరుకొని, యజ్ఞాశ్వాన్ని చూసి, జరిగిందంతా తెలుసుకుంటాడు. తన సోదరులకు పుణ్యగతులు ఎలా ప్రాప్తిస్తాయో చెప్పాల్సిందిగా కపిలుణ్ణి వేడుకుంటాడు. అసమంజసుడిపై దయతలచిన కపిలుడు..... దివిలో ప్రవహించే గంగానది ఆ అరవై వేలమంది సగర పుత్రుల మీద ప్రవహిస్తే... వారికి పుణ్యగతులు ప్రాప్తిస్తాయని చెబుతాడు.

గంగను కిందకు తీసుకువచ్చే ప్రయత్నంలో అసమంజసుడు, అతని కుమారుడు అంశుమంతుడు మరణిస్తారు. అనంతరం అంశుమంతుడి కుమారుడు దిలీపుడు సంతానం లేకుండానే మరణిస్తాడు. దీనితో రఘు వంశానికి వారసుడు కరువవుతాడు. తాను రఘువంశంలో దశరథుడి కుమారుడిగా జన్మించి, భూభారాన్ని తగ్గిస్తానని కొన్ని వేల ఏళ్ళ క్రితమే దేవతలకు నారాయణుడు మాట ఇచ్చాడు. వారసుడు లేకపోతే... నారాయణుడి మాట అసత్యం అవుతుంది. అలా జరిగితే భూమి నాస్తికమయం అవుతుంది. ధర్మం పట్ల ప్రజల మనసులో విశ్వాసం తగ్గుతుంది. దీనికి తరుణోపాయం తెలపాలని బ్రహ్మాది దేవతలు పరమశివుణ్ణి వేడుకుంటారు. శంకరుడు ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తాడు. తన ప్రణాళిక ప్రకారం అయోధ్యకు చేరుకుంటాడు. దిలీపుడి భార్యలు చంద్ర, మాల... శివుడికి స్వాగతం చెబుతారు. భక్తి శ్రద్ధలతో పరిచర్యలు చేస్తారు. సంతృప్తుడైన శివుడు... "మీలో ఒకరు త్వరలో గర్భం దాల్చి, పండంటి కుమారుడికి జన్మనిస్తారు" అని ఆశీర్వదిస్తాడు. ఆ ఆశీస్సు విని వాళ్ళు దిగ్భ్రాంతి చెందుతారు. "స్వామీ! ఇది ఎలా సంభవం?" అని అడుగుతారు. "ఇది దైవ సంకల్పం. మీ ఇద్దరి మధ్య జరిగే కలయిక కారణంగా పుత్రుడు జన్మిస్తాడు" అని చెప్పి, శివుడు కైలాసానికి చేరుకుంటాడు.

అప్పటికే ఋతుస్రావం ఆగిపోయిన మాలకు ... శివుడి ఆశీస్సుల కారణంగా నెలసరి అవుతుంది. చంద్ర, మాలల కలయిక జరిగి, మాల గర్భం దాలుస్తుంది. పది నెలల తరువాత... ఎముకలు లేని పిండానికి జన్మనిస్తుంది. ఎముకలు లేకపోవడం వల్ల ఆ పిండం నడవలేకపోతుంది. ఆ మాంసం ముద్దను చూసి చంద్ర, మాల విలపిస్తారు. 'శివుడు వరమిచ్చాడా, శాపమిచ్చాడా' అనేది తేల్చుకోలేకపోతారు. పిండం పెరిగి పెద్దదైతే అభాసుపాలవుతామని భయపడతారు. ఆ పిండాన్ని కొంగుచాటున దాచుకొని సరయూ నదీ తీరానికి చేరుతారు. దాన్ని నదిలో పారేయాలనుకుంటున్న వారిద్దరినీ వశిష్ఠుడు చూస్తాడు. దివ్యదృష్టితో అంతా తెలుసుకుంటాడు. ఆ పిండం రఘువంశ వారసుడని గ్రహిస్తాడు. రఘువంశ పురోహితుడిగా... ఆ వంశ వారసుణ్ణి కాపాడడం తన విద్యుక్త ధర్మంగా భావించి... "మీరు ఆ పిండాన్ని ఒడ్డునే వదిలిపెట్టండి. దారిన పోయేవారెవరైనా దాన్ని కాపాడగలరు" అని చెప్పి వెళ్ళిపోతాడు. చంద్ర, మాల ఆ విధంగా చేస్తారు.

అప్పుడు సరయూ నదిలో స్నానం చేయడానికి అష్టావక్ర మహర్షి వస్తాడు. అష్టావక్రుడి శరీరంలోని ఎనిమిది వంకరల కారణంగా... ఆయన వంకరటింకరగా నడుస్తూ ఉంటాడు. ఎముకలు లేని పిండం కూడా అలాగే నడుస్తూ ఉంటుంది. ఆ పిండం తన నడకను అనుకరిస్తోందని అష్టావక్రుడు అనుమానిస్తాడు. 'అది నన్ను వెక్కిరిస్తూ ఉంటే భస్మం అవుతుంది. అలా కాకుండా... జన్మతః అలాగే ఉంటే... నా తపోబలం వల్ల సుందర రూపం దాల్చుతుంది' అనుకుంటాడు. పుట్టుకతోనే ఎముకలు లేని ఆ పిండం... అష్టావక్రుడి తపోబలం వల్ల సుందరమైన బాలుడిగా మారుతుంది. ఆ బాలుడు తన తల్లులను కలిసి, జరిగిన విషయం తెలియజేస్తాడు.

అయిదేళ్ళ వయసులో... ఆ బాలుణ్ణి విద్యాభ్యాసం కోసం వశిష్ఠుడి ఆశ్రమంలో చేరుస్తారు. ఆశ్రమంలోని కొందరు బాలురు అతని పుట్టుకను ఎగతాళి చేస్తారు. కోపంతో ఇంటికి చేరిన కుమారుడి ద్వారా... జరిగింది తెలుసుకున్న ఆ తల్లులు... అతని జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తారు. రెండు భగాల మధ్య కలయిక కారణంగా జన్మించిన వాడు కాబట్టి అతను భగీరథుడయ్యాడనేది... కృత్తివాస రామాయణంలోని భగీరథ వృత్తాంతం.

• డాక్టర్ ఎ.బి సాయిప్రసాద్
9980567541

మూలాలు బెంగాలీ పద్మ పురాణంలో...

'భగీరథుడు ద్వియోనిజుడు' అనే అంశాన్ని బెంగాలీ లిపిలో ఉన్న 'పద్మ పురాణం' నుంచి కృత్తివాసుడు తీసుకున్నాడు. రెండు భగాల మధ్య సంభోగం సంభవం అనే విషయాన్ని గురించి రుత్ వనిత, సలీం కిద్వాయ్ అనే ఇద్దరు విద్యావేత్తలు ప్రధానంగా పరిశోధన చేశారు. పద్నాలుగో శతాబ్దానికి చెందిన బెంగాలీ ధార్మిక గ్రంథాలలో... ఇద్దరు మహిళల మధ్య కలయిక సంభవమని సూచించే గ్రంథాలు ఉన్నాయని అమెరికా మోన్‌టానా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అయిన రుత్ వనిత "సేమ్ సెక్స్ మ్యారేజ్ అండ్ హిందూ ట్రెడిషన్స్' అనే గ్రంథంలో వివరించారు. కృత్తివాసుడు దీన్ని 'పద్మ పురాణం' నుంచి గ్రహించాడనీ, 'సుశ్రుత సంహిత'లో ఇద్దరు స్త్రీల మధ్య జరిగే కలయిక కారణంగా ఒకరిలో ఫలదీకరణ జరుగుతుందనీ రాసి ఉందనీ ఆమె పేర్కొన్నారు. కవిరాజ్ కుంజాలాల్ భిషగ్రత్న ఆంగ్లంలోకి అనువదించిన 'సుశ్రుత సంహిత' (చౌకంబా సంస్కృత సిరీస్-39, 135వ పేజీ) నుంచి కొన్ని పంక్తులను ఉదాహరణగా కూడా చూపించారు. ద్వియోని సంభవుడైన భగీరథ వృత్తాంతాన్ని చర్చిస్తున్న సందర్భంలోనే... మరో విషయం గురించి కుడా రుత్ వనిత ప్రస్తావిస్తూ "మేము వితంతువులం. మాకు సంతానం ఎలా కలుగుతుందని శివుణ్ణి చంద్ర, మాల ప్రశ్నించినట్టే... మేరీ మాత కూడా "నేను పురుషుణ్ణి ఎరుగను, ఇదెలా జరుగుతుంది?" అని దేవదూతను ప్రశ్నిస్తుంది. అప్పుడు దేవదూత "పరిశుద్ధాత్మ నీపైకి వస్తుంది. సర్వోన్నతుడి శక్తి నిన్ను కమ్ముకుంటుంది" అని (బైబిల్, లూకా- 1:34, 35) చెబుతాడు" అని పేర్కొన్నారు.

భగీరథుడు ద్వియోని సంభవుడనే వృత్తాంతం నాకు తెలిసినంతవరకూ ఏ భారతీయ రామాయణంలోనూ లేదు. అవధి భాషలో రామాయణాన్ని 'రామచరితమానస్' అనే పేరుతో రచించిన తులసీదాసు... బెంగాలీ కృత్తివాస రామాయణం నుంచి కొంతవరకూ ప్రభావితుడయ్యాడనేది విమర్శకుల అభిప్రాయం. (ఆధారం: కృత్తిపాస రామాయణం, ఆదికాండం, హిందీ అనువాదం. అనువాదకులు: యోగేశ్వర త్రిపాఠి యోగి, ప్రబంధ్‌కుమార్ మజుందార్, నవారుణ వర్మ)

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LdAzQmgలో చదవండి.

గీతాసారం

మనతో స్నేహం చేద్దాం...



"మానవుడు కోరికలు లేని మనసు ద్వారా తనను తాను ఉద్ధరించుకోవాలి. స్వీయ వినాశనానికి పాల్పడకూడదు. మనిషికి తనకు వశమైన మనసే బంధువు, తనకు వశంకాని మనసే శత్రువు" అని భగవద్గీతలోని 'ఉద్ధరే దాత్మనాత్మానాం' అనే గీతా శ్లోకంలో శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.ఈ శ్లోకంలో అనేక కోణాలు కనిపిస్తాయి. వాటిలో మొదటిది... తనను తాను ఉద్ధరించుకోవలసిన బాధ్యత ప్రతి వ్యక్తి మీదా ఉంటుంది. మనం చేసిన కర్మల వల్ల చెడు జరిగినప్పుడు లేదా ఆశించిన ఫలితాలు రానప్పుడు కుటుంబాన్నో, స్నేహితులనో, సహోద్యోగులనో, పరిస్థితులనో, పని వాతావరణాన్నో, దేశాన్నో తప్పుపట్టడం లేదా మనల్ని మనమే నిందించుకోవడం సర్వసాధారణంగా జరిగే విషయం. ఇది చాలా తీవ్రమైన కక్షలు పెరిగిపోవడానికి, ఇతరుల పట్ల ద్వేషానికి కారణమవుతుంది. కొందరిలో ఈ వైఖరులు జీవితాంతం కొనసాగుతాయి. మరోవైపు, మన జ్ఞాపకాలు మనల్ని పశ్చాత్తాపాన్ని గుర్తుచేసినప్పుడల్లా... మనల్ని మనం పదేపదే శిక్షించుకుంటాం. పరిస్థితులు ఏవైనప్పటికీ... మనల్ని మనం ఉద్ధరించుకోవాలని ఈ శ్లోకం మనకు చెబుతుంది. శరణాగతి, ప్రశ్నించడం, సేవ అనే మూడు లక్షణాలను మనలో అభివృద్ధి చేసుకున్నప్పుడు... మనకు సాయం చెయ్యడానికి గురువు మనల్ని చేరుతాడని అంతకుముందు కృష్ణుడు తెలిపాడు.

రెండోది... మనలోని పరిపూర్ణతలను, లోపాలను సమానంగా స్వీకరించడం ద్వారా... మన అసమర్థతలుగా భావించుకొనేవాటిని అధిగమించడం. అది మన భౌతికమైన రూపం కావచ్చు, సక్రమంగా లేని గతం కావచ్చు, విద్యాపరమైన, ఆర్థికపరమైన స్థాయి కావచ్చు, మనం ఎదుర్కొన్న ఆహ్లాదమైన, అసహ్యమైన పరిస్థితులు కావచ్చు. మూడోది... మనకు మనమే స్నేహితులుగా ఉన్నప్పుడు... నిరాశ, కోపం, మత్తుపదార్థాలకు లేదా వినోదపు తెరలకు బానిస కావడం లాంటి వాటికి ప్రధాన కారణమైన ఒంటరితనానికి అవకాశం ఉండదు. ముఖ్యంగా వృద్ధాప్యానికి దగ్గరవుతున్నప్పుడు... ఎవరి మీదా ఆధారపడకుండా సంతోషంగా ఉండడానికి ఇది దోహదం చేస్తుంది. చివరిగా... ఇది శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా మన గురించి మనం శ్రద్ధవహిస్తూ... సమతుల్యమైన జీవనం గడపడానికి సంబంధించిన విషయం. ఆలా గడిపినప్పుడు జీవితంలోని ప్రతి అంశం చక్కగా ఉంటుంది. మనం మనతో స్నేహం చేసుకుంటే జరిగే సహజ పరిణామం ఏమిటంటే... పక్షపాతంగా వ్యవహరించడం, ఇతరుల ప్రవర్తన మీద తీర్పులు చెప్పడం లాంటివి వదిలేస్తాం. అప్పుడు మొత్తం ప్రపంచం మనకు స్నేహితుడిగా మారుతుంది. సకల లోకానికీ మనం స్నేహితులం అవుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ధ్యాన మూలం గురోర్మూర్తిః

ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితిని చేరడానికి మూడు సోపానాలను పూర్వులు పేర్కొన్నారు. వాటిలో మొదటి మెట్టు ధ్యానం, రెండో మెట్టు ధారణ, మూడో మెట్టు సమాధి (నిర్విచార స్థితి). మీకు సత్యాన్వేషణపై అభిలాష ఉన్నప్పుడు... మీరు ఆరాధించే దైవం మీద మీ చిత్తాన్ని నిలకడగా నిలపడాన్నే 'ధ్యానం' అంటారు. 'ధారణ' అంటే... ధ్యానం కోసం ఏకాగ్రతతో చేసే సంపూర్ణ ప్రయత్నం. కాబట్టి మీరు కొలిచే దైవాన్ని ఏకాగ్రతతో స్మరించుకోండి. మీ చిత్తాన్ని ఆ దైవం మీద లగ్నం చేయండి. మొదట్లో చిత్తం చంచలంగా ఉంటుంది. క్షణక్షణం దారి తప్పుతూ ఉంటుంది. అప్పుడు మీరు ధ్యానంలో ఉంటారు కాని... ధారణ ఉండదు. ధారణ అనే స్థితి చాలా ముఖ్యమైనది. ఈ స్థితిలో మీ చిత్తం భగవంతునితో అనుసంధానం అవుతుంది. ఎప్పుడైతే ధ్యాన, ధారణ స్థితులు మీలో సంపూర్ణ వికాసం పొందుతాయో... అప్పుడు మీరు సమాధి స్థితిని చేరుకుంటారు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన చేస్తున్నవారికి ఈ స్థితిని చేరుకోవడం చాలా సులభం.

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదం
మంత్రమూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోః కృపాః అన్నారు పూర్వులు. మీరు మీ గురువు దగ్గర, మీరు ఆరాధించే దైవం దగ్గర మోకరిల్లి, మీరు ధ్యానం చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని, పరిస్థితులను, మానసిక స్థితిని ప్రసాదించాలని వేడుకోవాలి. అహంకారానికి అతీతంగా... భగవంతుడితో మమేకమై, మిమ్మల్ని మీరు తెలుసుకున్నప్పుడే ధ్యానంలో ప్రవేశిస్తారు. ధ్యానం ఉదయం, సాయంత్రం... రెండు పూటలా చేయడం మంచిది. ఉదయం చేసే ధ్యానంలో... మనల్ని మనం అంతర్ముఖంగా పరిశీలించుకోవాలి. 'నేను ఆధ్యాత్మికంగా ఎంత లోతుకు వెళ్ళగలిగాను? నా ఆధ్యాత్మికమైన ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తున్నవేమిటి?' అని ప్రశ్నించుకోవాలి. సాయంత్రం ధ్యానంలో... 'నేను ఇతరులకు ఎంత మేరకు సహాయపడగలిగాను? భగవత్కార్యాల్లో ఎంత మేరకు పాలుపంచుకోగలిగాను?' అని మదింపు చేసుకోవాలి. ధ్యానంలో... ఎలాంటి ఆలోచనలూ లేని నిర్విచార స్థితికి చేరుకొనే మార్గంలో... ఆ ఆత్మపరిశీలన అవసరం.



ధ్యానంలో మనం చేరుకొనే ఆ ఆలోచనారహిత స్థితి... కొద్ది సేపే అయినా... భగవంతుడితో మనల్ని అనుసంధానిస్తుంది. తద్వారా మన ప్రార్థనలు భగవంతుణ్ణి చేరుతాయి. ప్రార్థనలో మనలో కదిలే ప్రశ్నలకు, సందేహాలకు భగవంతుడు ఇచ్చే సమాధానం, పరిష్కారం ధ్యానం ద్వారానే మనకు చేరుతాయి. అది మనసుకు ఆహ్లాదాన్ని, ఓర్పును ఇస్తుంది. మన సమస్యలను తీరుస్తుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు అతీతంగా మారుతాం. మనల్ని మనం అదుపు చేసుకోగలుగుతాం. ధ్యానం వల్ల కుడి, ఎడమ పార్శ్వాల్లోని సమస్యలను వదిలేసి... మధ్యస్థంగా ఉంటారు. అంటే, గతానికి, భవిష్యత్తుకు సంబంధించిన అనవసరమైన ఆలోచనలను వదిలేస్తారు. వర్తమానంలో ఉంటారు. మీ వివేకాన్ని, ఆనందాన్ని అనుభూతి చెందుతారు. అదే విలంబ స్థితి.

పూర్వకాలంలో మునులు, ఋషులు ఐహిక బంధాలను వదులుకొని, అడవులకో, హిమాలయాలకో వెళ్ళి తపస్సు చేసుకొనేవారు. సంసారాలను వదలనక్కరలేకుండా, ఎక్కడికీ వెళ్ళక్కర్లేకుండా... ఎప్పుడైనా, ఎక్కడైనా చేసుకోగలిగే ప్రక్రియను శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజయోగ స్థాపన ద్వారా మానవాళికి అందించారు. కుండలినీ జాగృతిద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, తమ దైనందిన జీవితంలో చేసుకొనే ధ్యానంతో... నిర్విచార స్థితిని, ఆ తరువాత నిర్వికల్ప స్థితిని... అంటే భగవంతుడిపట్ల ఎలాంటి సందేహాలూ లేని స్థితిని పొందగలరని నిరూపించారు. సహజయోగ సాధనలో ధ్యానం... మన దైనందిన జీవితంతో సమ్మిళితమై ఉంటుంది. ఈ ధ్యానంలో మనల్ని, మన ఆరోగ్యాన్నీ సమతుల్యం చేసుకోవడం, మెరుగుపరుచుకోవడం ఒక సాధారణ విషయం. అంతేతప్ప సహజయోగ ధ్యానం ఆరోగ్యం కోసమో, రోగనివారణ కోసమో మాత్రమే కాదు. అందుకు అతీతమైనది.

డాక్టర్ పి. రాకేష్ , 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



నవ్య | చిత్రజ్యోతి

పక్కా థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా

- ఎస్.ఎస్.రాజమౌళి



నటుడు సత్య దేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు, మే 10 ఈ చిత్రం విడుదల అవుతోంది. బుధవారం ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ "డైరెక్టర్ టీజర్, ట్రైలర్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచేశారు. ఇది పక్కా థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా అన్న అనుభూతిని కలిగించారు. ఈ సినిమాతో సత్యదేవ్ స్టార్ అవుతారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. చిత్ర సమర్పకుడు కొరటాల శివ మాట్లాడుతూ "డైరెక్టర్ చెప్పిన కథ వినగానే ఈ సినిమాలో నేనూ ఓ భాగం అవుదామని ఇలా సమర్పకుడిగా వ్యవహరించాను. నేను చూసిన మంచి నటుల్లో సత్యదేవ్ ఒకరు. కాల భైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు" అని అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ "కొరటాల శివ సినిమాను ఓకే చేయగానే సినిమా సగం సక్సెస్ అనుకున్నాం. డైరెక్టర్ ఈ సినిమా కథ చెప్పినప్పుడే ఇది వంద కోట్ల కంటెంట్ ఉన్న సినిమా అనిపించింది. కృష్ణా నది ఎన్ని మలుపులు తిరిగి గమ్య స్థానం చేరుకుంటుందో..ఈ సినిమాలోనూ అన్నే మలుపులు ఉన్నాయి" అని అన్నారు. "మూవీకి ఈ టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూశాక తెలుస్తుంది" అని డైరెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, గోపిచంద్ మలినేని, చిత్ర బృందం పాల్గొన్నారు.



ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకక్కుతోన్న చిత్రం 'కుబేర'. నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం చిత్రబృందం నాగార్జున ఫస్ట్‌లుక్ టీజర్‌ను ఆవిష్కరించింది. కథ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా నోట్ల కట్టలతో నిండిన కంటైనర్ల మధ్య వర్షంలో గొడుగుపట్టుకొని కళ్లద్దాలతో ఉన్న నాగార్జున లుక్ ఆకట్టుకుంది.

పేదల కోసం వీరమల్లు పోరాటం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం తొలి భాగం టీజర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. చార్మినార్, ఎర్రకోట లాంటి భారీసెట్‌లు, పవన్ కల్యాణ్ వీరోచిత పోరాట ఘట్టాలు, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలు వెరసి సినిమా భారీ స్థాయిలో తెరకెక్కిందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. మరో అప్డేట్‌ను ఈ సందర్భంగా చిత్రబృందం పంచుకుంది. ఇకపై 'హరిహర వీరమల్లు' మిగిలిన చిత్రీకరణ,నిర్మాణానంతర కార్యక్రమాలను క్రిష్ పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతి కృష్ణ పూర్తి చేస్తారని యూనిట్ తెలిపింది. ఈ ఏడాది చివర్లో 'హరిహర వీరమల్లు' రిలీజ్ అవనుంది. నిధి అగర్వాల్, బాబీడియోల్, సునీల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్, మనోజ్ పరమహంస.



మాట నిలబెట్టుకున్నారు

ప్రముఖ నిర్మాత కె.ఎల్.నారాయణ సుదీర్ఘ విరామం తర్వాత రాజమౌళి, మహేశ్‌బాబు కలయికలో వస్తున్న సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌ను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ప్రస్తుతం వారి క్రేజ్ ఆకాశాన్ని తాకేలా ఉంది. రాజమౌళికి హాలీవుడ్ నుంచి కూడా ఆఫర్స్ వస్తున్నాయి. అయినా వాటిని కాదనుకుని ఇచ్చిన మాటకు కట్టుబడిన రాజమౌళి, 'దుర్గా ఆర్ట్స్' బ్యానర్‌లోనే ఈ మూవీ తీస్తున్నామని ప్రకటించి మాట నిలబెట్టుకున్నారు. రెండు నెలల నుంచి ప్రీ ప్రొడక్షన్ సాగుతోంది. ఆగస్టు లేదా సెప్టెంబరులో చిత్రీకరణ ప్రారంభం అవుతుంది" అని చెప్పారు.

నాన్న టైటిల్ ఇచ్చి ఆశీర్వదిస్తున్నారు



'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నరేశ్ మాట్లాడుతూ 'నేను ఇన్ని సంవత్సరాలు పరిశ్రమలో ఉన్నానంటే కారణం మా నాన్నగారు. ఆయన ఉన్నన్ని రోజులూ నాతో సినిమాలు తీసి హిట్లు ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఆయన లేనప్పుడు కూడా తన సినిమా టైటిల్ ఇచ్చి బ్లెస్ చేస్తున్నారు' అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అడవి శేష్ మాట్లాడుతూ 'నరేశ్ అంటే మా ఇంట్లో మనిషి. ఆయన ఎప్పుడూ ఇతరుల ఆనందాన్ని కోరుకుంటారు. మే 3న ఈ సినిమాను అందరం థియేటర్లలో చూద్దాం. ఎంజాయ్ చేద్దాం' అన్నారు. ఈ సినిమాతో నరేశ్ రూపంలో మంచి ఫ్రెండ్ దొరికాడని ఫరియా అబ్దుల్లా చెప్పారు.

దక్షిణాదికి వచ్చిన దెయ్యం కథ



తమన్నా, రాశీ ఖన్నా, సుందర్ నటించిన 'బాక్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నటుడు, చిత్ర దర్శకుడు సి. సుందర్ మీడియాతో మాట్లాడుతూ "అరణ్మనై' సిరీస్‌లో నాలుగో చిత్రమిది. మొదటి మూడు సినిమాలు తెలుగు, తమిళ భాషల్లో హిట్ అయ్యాయి. ఈ చిత్ర కథ కోసం రీసెర్చ్ చేసే క్రమంలో చరిత్రతో ముడిపడిన ఓ ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. అస్సామీ జానపదంలో 'బాక్' అనే ఘోస్ట్ ఉండేదని అక్కడివారి నమ్మకం. తమ ప్రాంతాన్నాంతా చేతబడి చేశారని వారి విశ్వాసం. ఆ విషయం విని ఆశ్చర్యపోయా. అదే 'బాక్' కథకు బీజం వేసింది. అస్సామీ, బ్రహ్మపుత్ర ప్రాంతంలో ఉండే బాక్ అనే దెయ్యం సౌత్‌కి వస్తే ఎలాంటి పరిణామాలు సంభవించాయన్నది ఈ చిత్రకథ' అన్నారు.

సీట్ ఎడ్జ్‌లో కూర్చుని చూసేలా...



సినిమా సినిమాకు వైవిధ్యమైన రోల్స్ చేస్తూ సూపర్ హిట్స్‌ను తన ఖాతాలో వేసుకుంటున్నారు సుహాస్. ఆయన హీరోగా నటించిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ గురించి సుహాస్ మీడియాతో ముచ్చటించారు. "ఇందులో ఆర్జే పాత్ర పోషించాను. ఫేస్ బ్లైండ్‌నెస్ కారణంగా ఎలాంటి సమస్యల్లో ఇరుక్కుంటాను, వాటి నుంచి ఎలా భయటపడతాననేదే ఈ సినిమా కథాంశం. అందరినీ అలరించే సినిమా ఇది. చాలా మంది నా కథల ఎంపిక బావుంటుందని మెచ్చుకుంటుంటారు. ఈ సినిమాను థియేటర్లలో చూస్తున్నప్పుడు కచ్చితంగా థ్రిల్ ఫీలవుతారు. సీట్ ఎడ్జ్‌లో కూర్చుని చూసేలా ఈ సినిమా సాగుతుంది. దర్శకుడు అర్జున్ వై.కెకు ఇది తొలి చిత్రం అయినా చాలా అనుభవం ఉన్నట్లు సినిమాను తెరకెక్కించారు" అని చెప్పారు.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ముంబై

ముంబై X కోల్‌కతా

ఆఖరి బంతి థ్రిల్లర్

భువీ మాయతో గట్టెక్కిన హైదరాబాద్

జైస్వాల్, పరాగ్ పోరాటం వృథా

నితీశ్ కుమార్ హాఫ్ సెంచరీ

రైజర్స్ విన్నర్


భువనేశ్వర్ (3/41)


నితీశ్ (76 నాటౌట్)

హైదరాబాద్: థ్రిల్లర్ సినిమాను తలపించేలా సాగిన సన్‌రైజర్స్ హైదరాబాద్-రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. భారీ ఛేదనలో రియాన్ పరాగ్ (49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 77), జైస్వాల్ (40 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 67) దూకుడుతో మ్యాచ్ రాజస్థాన్‌దే అని అంతా భావించారు. అయితే చివరి బంతికి రెండు పరుగులు కావాల్సిన వేళ పోవెల్ (27) వికెట్‌తో పేసర్ భువనేశ్వర్ ప్రత్యర్థికి గట్టి ఝలక్ ఇచ్చాడు. దీంతో ఒక్క పరుగు తేడాతో నెగ్గి సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఊపిరిపీల్చుకుంది. రాజస్థాన్‌కిది రెండో ఓటమి. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 201 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్సర్లతో 76 నాటౌట్), హెడ్ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 58), క్లాసెన్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 నాటౌట్) రాణించారు. అవేశ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 200 పరుగులు చేసి ఓడింది. భువనేశ్వర్‌కు మూడు.. కమిన్స్, నటరాజన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా భువనేశ్వర్ నిలిచాడు.

ఆఖర్లో తడబాటు: స్లో పిచ్‌పై భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన రాజస్థాన్‌కు తొలి ఓవర్‌లోనే పేసర్ భువనేశ్వర్ గట్టి షాక్ ఇచ్చాడు. నాలుగు బంతుల తేడాలోనే ఓపెనర్ బట్లర్, కెప్టెన్ శాంసన్‌లను డకౌట్లుగా పెవిలియన్‌కు చేర్చాడు. ఈ స్థితిలోనూ ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఓపెనర్ జైస్వాల్, రియాన్ పరాగ్ మూడో వికెట్‌కు 134 పరుగుల భారీ భాగస్వామ్యంతో ఆర్ఆర్‌కు అండగా నిలిచారు. అయితే చివర్లో జట్టు తడబడడంతో మూల్యం చెల్లించుకుంది. మూడో ఓవర్‌లోనే పరాగ్ 4,6,4తో 15 రన్స్ అందించాడు. నాలుగో ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించిన జైస్వాల్.. తర్వాతి ఓవర్‌లోనూ 4,4,6తో చెలరేగాడు. దీంతో పవర్‌ప్లేలో స్కోరు 60/2కి చేరగా.. ఇదే జోరుకు పదో ఓవర్‌లోనే వంద రన్స్‌తో నిలిచింది. అలాగే ఇద్దరూ 11వ ఓవర్‌లోనే అర్ధసెంచరీలను సైతం పూర్తి చేసుకున్నారు. అయితే 78 బంతులపాటు సాగిన వీరి జోరుకు పేసర్ నటరాజన్ బ్రేక్ వేశాడు. స్కూప్ షాట్‌కు యత్నించిన జైస్వాల్ బౌల్డ్ అయ్యాడు. అలాగే 16వ ఓవర్‌లో కమిన్స్ మూడు పరుగులే ఇచ్చి పరాగ్‌ను అవుట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దీనికి తోడు ఓ భారీ సిక్సర్‌తో ఆకట్టుకున్న హెట్‌మయెర్ (13)ను నటరాజన్ వెనక్కి పంపాడు. 19వ ఓవర్‌లో కమిన్స్.. జురెల్ (1) అవుట్ చేయగా, పోవెల్ సిక్సర్‌తో సమీకరణం ఆరు బంతుల్లో 13 రన్స్‌కు మారి ఉత్కంఠ తారస్థాయికి చేరింది. అయితే పోవెల్ పోరాటంతో ఐదు బంతుల్లో 11 రన్స్ వచ్చాయి. ఇక చివరి బంతికి రెండు రన్స్ కావాల్సిన వేళ పోవెల్‌ను భువీ ఎల్బీ చేయడంతో రైజర్స్ సంబరాల్లో మునిగింది.

నెమ్మదిగా ఆరంభమైనా..: టాస్ గెలిచిన రైజర్స్ బ్యాటింగ్ ఎంచుకోవడంతో ఇక తొలి బంతి నుంచే విధ్వంసం ఆరంభమైనట్టే అని అంతా భావించారు. కానీ అంచనాలకు భిన్నంగా ఆరంభంలో వీరి ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. మధ్య ఓవర్ల నుంచి ఆఖరి వరకు నితీశ్ కుమార్ స్ట్రోక్‌ప్లే ధాటికి రైజర్స్ భారీ స్కోరే అందుకుంది. హెడ్, క్లాసెన్ సహకరించారు. అయితే మొదట రాజస్థాన్ బౌలర్ల కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులకు ఓపెనర్లు హెడ్, అభిషేక్ తమ దూకుడును తగ్గించాల్సి వచ్చింది. దీంతో రైజర్స్ ఈ సీజన్‌లోనే పవర్‌ప్లేలో అత్యల్ప స్కోరు (37)ను నమోదు చేయడంతో పాటు అభిషేక్ (12), అన్మోల్‌ప్రీత్ (5) వికెట్లను సైతం కోల్పోయింది. పరిస్థితిని గమనించిన హెడ్, నితీశ్ వికెట్‌ను కాపాడుకునే క్రమంలో జాగ్రత్తగా ఆడారు. కానీ ఆర్ఆర్ ఆధిపత్యం తొలి ఎనిమిది ఓవర్ల పాటే సాగింది. అప్పటికి రైజర్స్ స్కోరు 48/2 మాత్రమే. ఈ దశలో నిరాశగా మ్యాచ్‌ను తిలకిస్తున్న ఉప్పల్ ఫ్యాన్స్‌కు తొమ్మిదో ఓవర్‌లో హెడ్ 6,6,4తో ఊపు తెచ్చాడు. చాహల్ వేసిన ఈ ఓవర్‌లో 18 పరుగులు వచ్చాయి. అక్కడి నుంచి రైజర్స్ లయ అందుకుంది. ఆ తర్వాత నితీశ్ కూడా గేరు మార్చి అశ్విన్, అవేశ్ ఓవర్లలో ఒక్కో సిక్సర్ బాదడంతో స్కోరులో వేగం పెరిగింది. అటు హెడ్ 37 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అలాగే ఈసారి చాహల్ మరో ఓవర్‌ను లక్ష్యంగా చేసుకున్న నితీశ్ 6,4,6,4తో ఏకంగా 21 రన్స్ రాబట్టడంతో రైజర్స్ వంద పరుగులను కూడా పూర్తి చేసింది. కానీ ఈ జోరుకు బ్రేక్ వేస్తూ 15వ ఓవర్‌లో హెడ్‌ను అవేశ్ వైడ్ యార్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేయడంతో మూడో వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన నితీశ్ మాత్రం అశ్విన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో దూకుడును కొనసాగించాడు. అటు క్లాసెన్ కూడా జోరు పెంచి చాహల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదడంతో 17 రన్స్ వచ్చాయి. అలాగే చివరి రెండు ఓవర్లలోనూ అతడి మూడు ఫోర్లు, ఓ సిక్స్ ధాటికి 25 రన్స్ రావడంతో పాటు జట్టు స్కోరు 200 మార్క్ దాటింది.

1 ఉప్పల్ మైదానంలో మూడో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (134) నమోదు చేసిన జైస్వాల్-పరాగ్.

1 ఒక్క పరుగు తేడాతో సన్‌రైజర్స్ గెలవడం ఐపీఎల్‌లో ఇదే తొలిసారి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) అవేశ్ 58, అభిషేక్ (సి) జురెల్ (బి) అవేశ్ 12, అన్మోల్‌ప్రీత్ (సి) జైస్వాల్ (బి) సందీప్ 5, నితీశ్ (నాటౌట్) 76, క్లాసెన్ (నాటౌట్) 42, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 201/3 ; వికెట్లపతనం:** 1-25, 2-35, 3-131; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-33-0, అశ్విన్ 4-0-36-0, అవేశ్ ఖాన్ 4-0-39-2, సందీప్ శర్మ 4-0-31-1, చాహల్ 4-0-62-0.

రాజస్థాన్: జైస్వాల్ (బి) నటరాజన్ 67, బట్లర్ (సి) యాన్సెన్ (బి) భువనేశ్వర్ 0, శాంసన్ (బి) భువనేశ్వర్ 0, పరాగ్ (సి) యాన్సెన్ (బి) కమిన్స్ 77, హెట్‌మయెర్ (సి) యాన్సెన్ (బి) నటరాజన్ 13, పొవెల్ (ఎల్బీ) భువనేశ్వర్ 27, జురెల్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 1, అశ్విన్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు : 13: మొత్తం 20 ఓవర్లలో 200/7 ; వికెట్లపతనం:** 1-1, 2-1, 3-135, 4-159, 5-181, 6-182, 7-200; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-41-3, యాన్సెన్ 4-0-44-0, కమిన్స్ 4-0-34-2, నటరాజన్ 4-0-35-2, ఉనాద్కట్ 2-0-23-0, నితీశ్ 1-0-12-0, షాబాజ్ 1-0-11-0.



నలుగురు స్పిన్నర్లు ఉండాల్సిందే

రోహిత్ శర్మ

ముంబై: భారత టీ20 వరల్డ్‌కప్ టీమ్‌లో నలుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడాన్ని కెప్టెన్ రోహిత్ శర్మ పూర్తిగా సమర్థించుకున్నాడు. సెలెక్షన్ విషయంలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఎంతో స్పష్టతతో ఉన్నట్టు చెప్పాడు. జట్టు ఎంపికపై ఎదురవుతున్న విమర్శలకు సమాధానం చెప్పేందుకు గురువారమిక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్‌తోపాటు సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కూడా పాల్గొన్నాడు. 'విండీస్‌లో ఆడేందుకు నలుగురు స్పిన్నర్లు కావాల్సిందే. దానికి తగిన కారణాలు ఉన్నాయి. మాకు వెస్టిండీస్ పిచ్‌లపై ఆడిన అనుభవం ఉంది. అక్కడ ఉదయం 10 గంటలకు మ్యాచ్ ఆరంభమవుతుంది. గయానా, ఆంటిగ్వా వికెట్లు స్లో బౌలర్లకు సహకరిస్తాయ'ని రోహిత్ చెప్పాడు.

అది కఠిన నిర్ణయమే : అగార్కర్

ఫామ్‌లోలేకున్నా పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు జట్టులో చోటు కల్పించడం సరైన నిర్ణయమేనని అగార్కర్ చెప్పుకొచ్చాడు. 'ఫిట్‌నెస్ ఉంటే హార్దిక్‌కు ప్రత్యామ్నాయమే లేదు. ఓ మిడిలార్డర్ బ్యాటర్‌ను తీసుకోవడం కోసం టాప్‌లో ఆడుతున్న కేఎల్ రాహుల్‌ను పక్కనబెట్టాల్సిన పరిస్థితి. అలాగే రింకూను పక్కనబెట్టడం కఠిన నిర్ణయమే' అని అగార్కర్ అన్నాడు.

సలీమాకు పగ్గాలు

మహిళల హాకీ జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : వెటరన్ గోల్‌కీపర్ సవితా పూనియాపై వేటు పడింది. భారత మహిళల హాకీ జట్టు కెప్టెన్‌గా ఆమెను తొలగించి..మిడ్‌ఫీల్డర్ సలీమా టేటేకు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు..బెల్జియం, ఇంగ్లండ్ అంచె ప్రొ.హాకీ లీగ్‌లో తలపడే 24 మంది సభ్యుల భారత జట్టును గురువారం ప్రకటించారు. సవిత సారథ్యంలో జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. అలాగే స్వదేశంలో జరిగిన ప్రొ.లీగ్ హాకీ మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటలేకపోయింది. తెలుగమ్మాయి ఈదుల జ్యోతి (ఫార్వర్డ్) జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంది.

'అవుటాఫ్ దిస్ వరల్డ్'..



టీ 20 ప్రపంచ కప్ గీతం విడుదల

న్యూఢిల్లీ: మరో నెల రోజుల్లో పురుషుల టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. వెస్టిండీస్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ అధికారిక గీతాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం విడుదల జేసింది. గ్రామీ అవార్డు విజేత సీన్ పాల్, సోకా సూపర్ స్టార్ కెస్ సంయుక్తంగా 'అవుటాఫ్ దిస్ వరల్డ్' పేరిట ఈ గీతాన్ని రూపొందించారు. మైఖేల్ టానో మొంటానో నిర్మాణంలో గీతం రూపొందింది. జమైకా దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్, వెస్టిండీస్ క్రికెట్ స్టార్లు క్రిస్ గేల్, శివనారాయణ్ చందర్‌పాల్, స్టెఫానీ టేలర్, అమెరికా బౌలర్ అలీ ఖాన్ ఈ అధికారిక గీతానికి సంబంధించిన వీడియోలో తళుక్కున మెరిశారు.

క్వార్టర్స్‌లో భారత జట్లకు షాక్

థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్

చెంగ్డూ (చైనా): భారత పురుషుల, మహిళల జట్లు థామస్, ఉబెర్‌కప్‌ల్లో ఇంటిదారి పట్టాయి. ముఖ్యంగా పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు షాక్ తగిలింది. గురువారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో టీమిండియా చైనాతో పోరులో 1-3తో తడబడింది. భారీ అంచనాలున్న ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి, ధ్రువ్ కపిల-సాయి ప్రతీక్‌లు ఓడగా.. లక్ష్య సేన్ ఒక్కడే ఊరటనిచ్చాడు. కాగా, బుధవారం ఇండోనేసియాతో మ్యాచ్ ఆడడంతో భారత ఆటగాళ్లు కొంత అలసిపోగా.. ఓ రోజు విశ్రాంతి లభించడంతో చైనా ప్లేయర్లు కోర్టులో పాదరసంలా కదులుతూ పైచేయి సాధించారు.

అమ్మాయిలు పోరాడారు.. కానీ..: ఉబెర్ కప్‌లో పీవీ సింధులాంటి సీనియర్ ప్లేయర్ దూరమైనా.. అద్భుత పోరాటంతో నాకౌట్‌కు చేరినా భారత మహిళల జట్టు అదే జోరును కొనసాగించలేక పోయింది. క్వార్టర్స్‌లో భారత్ 0-3తో జపాన్ చేతిలో పోరాడి ఓడింది. తొలి సింగిల్స్‌లో అస్మిత చలీహా, రెండో మ్యాచ్‌లో ఇస్రాని బారువా ఓటమిపాలయ్యారు. ఇక డబుల్స్ మ్యాచ్‌లో కొంజెంగ్‌బమ్-శ్రుతి మిశ్రా పరాజయం పాలవడంతో టీమిండియా ఓటమి పరిపూర్ణమైంది.

మనమ్మాయిలదే సిరీస్

మూడో మ్యాచ్‌లోనూ బంగ్లా చిత్తు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత మహిళల జట్టు మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే గెలుచుకుంది. గురువారం జరిగిన మూడో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఏడు వికెట్లతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. తొలుత బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 117/8 స్కోరు చేసింది. దిలారా అక్తర్ (39), నిగర్ సుల్తానా (28) మాత్రమే రాణించారు. రాధా యాదవ్ రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 18.3 ఓవర్లలో 121/3 స్కోరు చేసి నెగ్గింది. షఫాలీ వర్మ (51) హాఫ్ సెంచరీతో మెరవగా, మంధాన (47) సత్తా చాటింది.

మెస్సీ, రొనాల్డోలను వెనక్కునెట్టిన కోహ్లీ

టాప్-100లో టాప్



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ పాపులారిటీ రోజు రోజుకూ పెరుగుతోంది. తాజాగా 'ది ర్యాంకర్' అనే వెబ్‌సైట్ నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో 2024 టాప్-100 అథ్లెట్లలో కోహ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ క్రమంలో సాకర్ స్టార్లు మెస్సీ, రొనాల్డోను కూడా కోహ్లీ వెనక్కునెట్టాడు. రొనాల్డో రెండో స్థానంలో, మెస్సీ మూడో స్థానంలో నిలిచారు.

కోఫోర్జ్ గూటికి సిగ్నిటీ

54 శాతం వాటా కొనుగోలు.. ఒక్కో షేరుకు రూ.1,415 చెల్లింపు

జూలై-సెప్టెంబరు త్రైమాసికం నాటికి డీల్ పూర్తి

Cigniti



రెండేళ్లలో 200 కోట్ల డాలర్ల కంపెనీ..

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల కంపెనీ సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వరకు వాటాను కొనుగోలు చేయనున్నట్లు నోయిడాకు చెందిన ఐటీ సంస్థ కోఫోర్జ్ గురువారం ప్రకటించింది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో చేపట్టనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా సిగ్నిటీకి చెందిన ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ నెల 2న బీఎస్ఈలో సిగ్నిటీ షేరు ముగింపు ధర రూ.1,372.65తో పోలిస్తే 3 శాతం అధికమిది. సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వరకు ఈక్విటీ వాటా కొనుగోలుకు కంపెనీ ప్రమోటర్లు, ఎంపిక చేసిన వాటాదారులతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకునేందుకు అంగీకారం లభించిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కోఫోర్జ్ వెల్లడించింది. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు)లో ఈ డీల్ పూర్తి కావచ్చని అంచనా. ఈ ఒప్పందం పూర్తయిన అనంతరం సెబీ నిబంధనల ప్రకారంగా సిగ్నిటీ టెక్నాలజీస్.. వాటాదారుల నుంచి షేర్ల కొనుగోలు కోసం కోఫోర్జ్ ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి ఉంటుంది. తద్వారా సిగ్నిటీలో కోఫోర్జ్ వాటా 80 శాతం వరకు పెరగనుంది.

సిగ్నిటీ టెక్నాలజీస్ కొనుగోలుతో తమ కంపెనీ 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి 200 కోట్ల డాలర్ల విలువైన కంపెనీగా ఎదిగేందుకు దోహదపడుతుందని కోఫోర్జ్ భావిస్తోంది. అంతేకాదు, సంస్థ నిర్వహణ లాభాల మార్జిన్ సైతం 1.5-2 శాతం మేర మెరుగుపడవచ్చని అంచనా వేస్తోంది. అలాగే, రిటైల్, టెక్నాలజీ, హెల్త్‌కేర్ విభాగాల్లోకి విస్తరించడంతోపాటు ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్యం, పశ్చిమ యూఎస్ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఈ డీల్ దోహదపడనుంది.

రూ.2,100 కోట్ల సమీకరణ

కాగా కోఫోర్జ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ కోఫోర్జ్ పీటీఈ లిమిటెడ్.. 25 కోట్ల డాలర్ల రుణాల (సుమారు రూ.2,100 కోట్లు)ను సమీకరించేందుకు గాను హాంకాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, గిఫ్ట్ సిటీ బ్రాంచీతో ఒప్పందం కుదుర్చుకుంది. సిగ్నిటీ కొనుగోలు కోసం కంపెనీ ఈ మొత్తాలను వినియోగించనుంది.

డీల్‌కు సిగ్నిటీ బోర్డు ఓకే

కోఫోర్జ్‌కు 54 శాతం వాటాలను విక్రయించేందుకు గాను గురువారం నాడు సిగ్నిటీ టెక్నాలజీ బోర్డు ఆమోదం తెలిపింది. కంపెనీ ప్రమోటర్లు చక్కిలం వెంకట సుబ్రమణ్యం, రాజేశ్వరి చక్కిలం, చక్కిలం శ్రీకాంత్, పెన్నం సుధాకర్, సప్న పెన్నం ఈ మేరకు ఆమోదం తెలిపినట్లు బోర్డు పేర్కొంది. డీల్‌లో భాగంగా కంపెనీ ప్రమోటర్లు 32.47 శాతం వరకు ఈక్విటీని కోఫోర్జ్‌కు విక్రయించనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 32.77 శాతం వరకు ఉంది. కాగా 1998 సెప్టెంబరులో కార్యకలాపాలు ప్రారంభించిన సిగ్నిటీ టెక్నాలజీస్.. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఆస్ట్రేలియా, కెనడా, చెక్ రిపబ్లిక్, దక్షిణాఫ్రికా,సింగపూర్ మార్కెట్లకు డిజిటల్ అస్యూరెన్స్, ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, క్వాలిటీ ఇంజనీరింగ్ సేవలందిస్తోంది.

కోఫోర్జ్ లాభంలో 95% వృద్ధి

ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) కోఫోర్జ్ కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 95 శాతం వృద్ధితో రూ.223.7 కోట్లకు చేరుకుంది. ఆదాయం 8.68 శాతం పెరిగి రూ.2,358.5 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ లాభం 16.46 శాతం వృద్ధితో రూ.808 కోట్లకు, ఆదాయం 14.52 శాతం పెరుగుదలతో రూ.9,179 కోట్లకు చేరుకుంది. ఈ మార్చి 31 నాటికి కోఫోర్జ్ ఉద్యోగుల సంఖ్య 24,726కు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను కోఫోర్జ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.19 డివిడెండ్‌ను ప్రకటించింది.

సిగ్నిటీ లాభంలో క్షీణత

క్యూ4లో సిగ్నిటీ టెక్నాలజీస్ లాభం దాదాపు 45 శాతం క్షీణించి రూ.27.14 కోట్లకు పరిమితం కాగా.. విక్రయాలు మాత్రం 7.22 శాతం పెరిగి రూ.455.64 కోట్లకు చేరుకున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం 1.62 శాతం తగ్గి రూ.165.59 కోట్లకు చేరుకోగా, అమ్మకాలు 10.16 శాతం పెరుగుదలతో రూ.1,815.01 కోట్లుగా నమోదయ్యాయి.

● ఇసుజు మోటార్స్.. మార్కెట్లోకి లైఫ్‌స్టైల్ పికప్ మోడల్స్‌ను విడుదల చేసింది. వీ-క్రాస్ జెడ్ ప్రెస్టీజ్ పేరుతో మరింత పికప్, సరికొత్త లుక్‌తో వీటిని తీసుకువచ్చింది. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ డిసెంట్ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ వంటి కొత్త ఫీచర్లను ఈ మోడల్స్‌లో చేర్చింది. ఈ వాహన ప్రారంభ ధరలు రూ.21,19,900 (హై-లాండర్), రూ.25,51,700 (వీ-క్రాస్ జెడ్), రూ.26,91,700 (వీ-క్రాస్ జెడ్ ప్రెస్టీజ్)గా ఉన్నాయి.

● కియా ఇండియా.. హై-టెక్, స్మార్ట్ నావిగేషన్ కోసం మ్యాప్ మై ఇండియాతో జట్టు కట్టింది. దీంతో కియా కస్టమర్లు ఎప్పటికప్పుడు మ్యాప్ అప్‌డేట్స్ సహా లొకేషన్ సర్వీసులకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని అందుకుంటారని తెలిపింది.

కోల్ ఇండియా లాభం రూ.8,682 కోట్లు

ప్రభుత్వ రంగంలోని మహారత్న కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.8,682 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.6,875.07 కోట్లతో పోల్చితే ఇది 26.2 శాతం అధికం. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం రూ.40,371.51 కోట్ల నుంచి రూ.39,654.50 కోట్లకు దిగజారింది. దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా వాటా 80 శాతం ఉంది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.37,369 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

డివిడెండ్: కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.5 తుది డివిడెండ్‌కు సిఫారసు చేసింది. ఇప్పటికే చెల్లించిన మధ్యంతర డివిడెండ్ రూ.20.50కి ఇది అదనం. అంటే ఒక్కో షేరు ముఖవిలువపై 255 శాతం (రూ.25.50) డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కోల్ ఇండియా కేంద్ర ఖజానాకు, తాను కార్యకలాపాలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాలకు రూ.60,140 కోట్లు చెల్లించింది.

బిజినెస్

ఇక విశ్లేషకులపై స్టాక్ ఎక్స్ఛేంజీల పర్యవేక్షణ

న్యూఢిల్లీ: రీసెర్చ్ అనలిస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లపై నియంత్రణ, పర్యవేక్షణకు సంబంధించిన నిబంధనావళిని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రకటించింది. దీని కింద అనలిస్టులు, అడ్వైజర్ల పర్యవేక్షణకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారం ఇస్తారు. స్టాక్ ఎక్స్ఛేంజీలకు రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఆర్ఏఏఎస్‌బీ), ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఐఏఏఎస్‌బీ) పేరిట గుర్తింపు ఇస్తారు. ఈ గుర్తింపు సాధించాలంటే సంబంధిత ఎక్స్ఛేంజీ 15 సంవత్సరాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నదై ఉండాలి. అలాగే కనీస నికర విలువ రూ.200 కోట్లు కలిగి ఉండి, దేశవ్యాప్తంగా 20 నగరాల్లో టెర్మినల్స్, ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తూ ఉండాలి. అలాగే భౌతికంగా ఫిర్యాదుల పరిష్కార విభాగం, ఆన్‌లైన్‌లో వివాదాల పరిష్కార విభాగం నిర్వహిస్తూ ఉండాలి.

మార్కెట్‌కు జీఎస్‌టీ జోష్

128 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఏప్రిల్ నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడంతో పాటు తయారీ రంగం పనితీరు ఆశాజనకంగా ఉండటం స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం నింపింది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. దీంతో గురువారం సెన్సెక్స్ ఒకదశలో 330 పాయింట్ల వరకు పెరిగి 74,812 స్థాయికి ఎగబాకింది. చివరికి 128.33 పాయింట్ల లాభంతో 74,611.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43.35 పాయింట్ల వృద్ధితో 22,648.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 లాభపడ్డాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి 83.46 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ రేటు 0.91 శాతం పెరిగి 84.20 డాలర్ల వద్ద ట్రేడైంది.

మిశ్రమంగాముగిసిన గోద్రెజ్ షేర్లు: దేశంలోని ప్రముఖ వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన గోద్రెజ్ గ్రూప్ ఆస్తుల విభజన నేపథ్యంలో ఈ గ్రూప్ కంపెనీల షేర్లు మిశ్రమంగా ముగిశాయి. గోద్రెజ్ ఇండస్ట్రీస్ 7 శాతానికి పైగా క్షీణించగా.. గోద్రెజ్ ప్రాపర్టీస్ 4.37 శాతం, ఆస్టెక్ లైఫ్‌సైన్సెస్ 2.92 శాతం నష్టపోయాయి. కాగా, గోద్రెజ్ అగ్రోవెట్ షేరు దాదాపు 4 శాతం, గోద్రెజ్ కన్స్యూమర్ 1.11 శాతం పుంజుకున్నాయి.

ఆధార్ హౌసింగ్ ఇష్యూ ధర రూ.300-315

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.300-315గా నిర్ణయించింది. తద్వారా రూ.3,000 కోట్ల వరకు సమీకరించనుంది. ఐపీఓ ద్వారా ఈ సంస్థ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లకు చెందిన రూ.2,000 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

● ట్రావెల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ టీబీఓ టెక్ లిమిటెడ్ ఐపీఓ సైతం ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.1,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సంస్థ రూ.400 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన రూ.600 కోట్ల విలువైన 1.25 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

● వాహన, వ్యాపార రుణాలందించే ఎస్‌కే ఫైనాన్స్ ఐపీఓకు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2,200 కోట్లు సేకరించాలని సంస్థ భావిస్తోంది.

సైయెంట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్‌కు వాటా

సైయెంట్ లిమిటెడ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 1.02 శాతానికి సమానమైన 11.33 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ షేర్లను రూ.204.10 కోట్లతో కొనుగోలు చేసినట్లు బల్క్‌డీల్ గణాంకాలు వెల్లడించాయి. సగటున ఒక్కో షేరును రూ.1,800కు ఈ మ్యూచువల్ ఫండ్ సంస్థ కొనుగోలు చేసింది. తాజా వాటా కొనుగోలుతో సైయెంట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వాటా 1.08 శాతం నుంచి 2.1 శాతానికి పెరిగింది. గురువారం బీఎస్ఈలో సైయెంట్ షేరు 0.67 శాతం నష్టంతో రూ.1,794.30 వద్ద క్లోజైంది.

తగ్గిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం

ఎయిర్‌పోర్టుల నుంచి డేటా సెంటర్ల వరకు విభిన్న రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 37 శాతం క్షీణించి రూ.450.58 కోట్లకు పరిమితమైంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై రూ.627 కోట్ల బకాయిని ఏకకాలంలో చెల్లించడంతో పాటు కమర్షియల్ మైనింగ్‌లో ఏర్పడిన నష్టాలు లాభాన్ని ప్రభావితం చేసినట్టు కంపెనీ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.722.48 కోట్లు కాగా మూడో త్రైమాసిక లాభం రూ.188.45 కోట్లుంది. న్యూ ఎనర్జీ, విమానాశ్రయ వ్యాపారాల్లో మంచి వృద్ధి నమోదైనా కమర్షియల్ మైనింగ్ విభాగం రూ.201.83 కోట్లు నష్టం నమోదు చేసింది. ఇదిలా ఉండగా 2030 నాటికి దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం గల 9 డేటా సెంటర్లు కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఎడ్జ్ కనెక్స్ జాయింట్ వెంచర్‌లో చెన్నై డేటా సెంటర్ ప్రస్తుతం పని చేస్తుండగా నోయిడా, హైదరాబాద్ డేటా సెంటర్ల నిర్మాణం 81-88 శాతం పూర్తయినట్టు కంపెనీ ప్రకటించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	87,000 ▼
ముంబై	71,327	65,336	79,719

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




3వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	440
వరంగల్	427	గోదావరి	440
చిత్తూరు	494	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	విజయవాడ	137
వరంగల్	129	గుంటూరు	137
కరీంనగర్	129	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	127
కర్నూలు	129	నెల్లూరు	127
విశాఖపట్నం	129	అనంతపురం	137
గోదావరి	137		

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
7
శుక్రవారం 3 మే 2024





టీడీపీ హయాంలో నిర్మించిన దశతోనే ఆగిపోయిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ తరగతి గదుల సముదాయం



- జిల్లాలో 2,457 మందికి అవకాశం
- మూడు రోజుల్లో ముగింపునకు షెడ్యూల్
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి

నేటి నుంచి ఇంటి వద్ద ఓటింగ్

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా అమలులోకి తీసుకొచ్చిన హోం ఓటింగ్ (ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగం) ప్రక్రియ జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 12 వేల మంది వరకు ఉన్నారు. అలానే అంగవైకల్యం కలిగిన ఓటర్లు మరో 17 వేల మంది ఉన్నారని చెప్పారు. వీరిలో కేవలం 2,457 మంది మాత్రమే తాము ఇంటి వద్దనే ఓటు వేస్తామని ఫారం-12(డీ)లను బీఎల్‌వోలకు అందజేశారన్నారు. వారందరికీ శుక్రవారం నుంచి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. రోజుకు 800 మంది కంటే ఎక్కువ మందితో హోం ఓటింగ్ చేయించేందుకు 75 బృందాలను నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ బృందంలో ఐదు మంది సభ్యులు(పీవో, ఓపీవో, బీఎల్‌వో, కేంద్ర ప్రభుత్వ అధికారి(మైక్రో అబ్జర్వర్), వీడియోగ్రాఫర్) ఉంటారని చెప్పారు. ఓటర్లను సెక్టార్ల వారీగా విభజించామన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం విషయానికి వస్తే 11 సెక్టార్లుగా విభజించి టీంలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కో సెక్టార్‌లో గరిష్ఠంగా 36 వరకు ఓటర్లున్నారన్నారు. వీరి వెంట పోలింగ్ ఏజంట్‌లు కూడా వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.

సీక్రెట్ బ్యాలెట్

హోం ఓటింగ్ అయినప్పటికీ అంతా సీక్రెట్ బ్యాలెట్ పద్ధతినే జరుగుతుందని తెలిపారు. ప్రతీ టీంకి 10 శాతం సర్‌ప్లస్ బ్యాలెట్ పేపర్లను ఆర్‌వోలు అందజేశారు. అవసరమైనఫారం 13ఏ, ఇన్నర్ ఎన్‌వెలప్(ఫారం-13బీ - కవర్ ఏ), అవుటర్ ఎన్‌వెలప్(ఫారం-13సీ - కవర్ బీ)లను ఇచ్చారు. ఓటు మార్కు చేయడానికి పెన్, వేలిముద్ర వేసేందుకు ఇంక్ ప్యాడ్‌లు అందజేశారు. ఎన్‌వెలప్‌లు క్లోజ్ చేయడానికి గ్లూస్టిక్, ఓటర్ల సంతకాలకు రిజిష్టర్లు, ఓటింగ్ కంపార్టుమెంట్ ఏర్పాటుకు అవసరమైన మెటీరియల్‌ని అందజేశారు. సెక్టార్ అధికారి, బీఎల్‌వో ముందుగానే ఓటర్లకు తాము ఏ తేదీన, ఏ సమయంలో వచ్చేది తెలియజేస్తారు. ఒకవేళ ఆ రోజున అందుబాటులో లేకపోయినా రెండో సారి కూడా టీం ఓటర్ వద్దకు వెళ్లేందుకు షెడ్యూల్ ఇచ్చారు.

నాడు.. నేడు.. ఎక్కడికక్కడే

నాడు - నేడు అద్భుతం అన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లోని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించామన్నారు. రెండు విడతల్లో చేపట్టిన నాడు-నేడు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 3161 పాఠ శాలల్లో వేల పనులు చేపట్టారు. ఆర్భాటపు ప్రకటనలతో సరి పుచ్చిన ప్రభుత్వం నిధులు విడుదలపై నిర్లక్ష్యం చూపింది. దీంతో పలు పాఠశాలల్లో అరకొరగా.. కొన్ని దగ్గర్ల సగంలో ఆగి పోయి.. మరికొన్ని పాఠశాలల్లో అయితే మొదలే కాని పనులతో నాడు-నేడు అధ్వానంగా మారింది. రెండు విడతల్లోనూ పనులు సక్రమంగా జరగక విద్యార్థులు తీవ్రం గా ఇబ్బంది పడాల్సి వచ్చింది. మూడు జిల్లాల్లో రూ.699.25 కోట్లు పనులు చేపట్టగా రూ.352.82 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి. అంటే సగం పనులు కూడా సక్రమంగా జరగలేదని అర్ధమవుతోంది. నిధులు కొరతతో వందల పాఠశాలల్లో పనులు అర్ధాం తరంగా నిలిచి పోయాయి. కొన్ని పాఠశాలల్లో పనులను సాగదీ స్తున్నారు. అయితే అధికార పార్టీ నేతలు గత కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారంలో నాడు-నేడు మా గొప్ప అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసుకుంటున్నారు.

- నిధులు ఇవ్వక సాగని పనులు
- ప్రకటనల్లో గొప్ప.. ఆచరణలో అధోగతి
- చిత్తశుద్ధి లోపంతో పనులు పురోగతి అంతంతే
- విద్యా సంవత్సరం ముగిసినా పూర్తి కాని పనులు

బాపట్ల జిల్లా..

బాపట్ల జిల్లాలో 944 పాఠశాలల్లో 183.31 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా ఇప్పటికి రూ.92.72 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యా యి. 6,274 పనులకు 4,104 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,083 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 96 ప్యాకేజీల్లో 112 పాఠశాలల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తి చేశారు. 326 మరుగుదొడ్ల బ్లాక్‌లకు 163 చోట్ల పనులు పూర్తి అయ్యాయి. 78 పాఠశాలలకు ప్రహరీ పనులను మంజూరు కాగా తొమ్మిది పనులు పూర్తయ్యాయి. 327 విద్యుత్ పనులకు 215, 586 మరమ్మతుల పనులకు 157 పూర్తయ్యాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం.. అంటూ ముఖ్యమంత్రి జగన్ చెప్తోన్న గొప్పలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కానరావడంలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే చెప్తున్నారు. చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా జగన్‌మామ తీరుందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందే కాని అరకొరగా విడుదలతో సరిపెట్టింది. దీంతో పూర్తి చేసిన పనులకే బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రెండేళ్లుగా.. రెండు విడతల్లో చేపట్టిన పనులు మూడో ఏడు విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్నా ఒక కొలిక్కిరాలేదు. అంటే రెండు వేసవి సెలవులు ముగిసినా పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారన్న విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నాడు నేడు పథకం నిధుల లేమితో అబాసుపాలవుతున్నది. నాడు నేడులో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. నిధులు కొరతతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు పాఠాలను ఆరు బయట చెట్ల కింద నిర్వహించాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిసేవరకు పాఠశాలల్లో నాడు నేడు పనులు ఒక కొలిక్కి రాలేదు. మొత్తం మీద నాడు నేడు పనులపై పాలకుల చిత్తశుద్ధి లోపంతో పురోగతి అంతంతమాత్రంగానే ఉన్నా పాలకులు గొప్పగా ప్రకటించుకుంటున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. పనులకు నిధులు విడుదల కావడంలేదని పాఠశాలల పేరెంట్స్ కమిటీలు చెబుతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి విడుదలలో చతికిలపడింది. రూ.348.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపివేశాయి. స్కూల్స్‌లో మౌళిక వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నిధుల లేమితో పాఠశాలల్లో పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. నాడు నేడు పేరుతో పలు పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నిధుల విడుదలలో జాప్యంతో నూతన గదులు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తరగతి గదుల సమస్య నెలకొంది. సొంత డబ్బుతో పనులు చేసేందుకు కమిటీలు ముందుకు రావడంలేదు. పనులు చేసి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నాడు-నేడు-నిర్లక్ష్యం

నాడునేడులో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు రాక కొన్ని.. నిర్లక్ష్యంతో కొన్ని దగ్గర్ల పనులు సక్రమంగా సాగడంలేదు. కొన్ని దగ్గర్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు పాఠాలను రెండు విద్యా సంవత్సరాల్లో ఆరుబయట చెట్ల కింద నిర్వహించాల్సి వచ్చిం దని ఉపాధ్యాయులు వాపోయారు. రెండు విడతల్లో చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. పనుల పూర్తిపై అధికారులు నిర్లక్ష్యం వహించారని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల విలీనంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా గదుల నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. పనుల వేగవంతంగా అధికారులు సమీక్షలతో సరిపుచ్చారన్న విమర్శ లున్నాయి.



నరసరావుపేట : ములకలూరులో ఏడాదిగా పునాదులు దశ దాటని తరగతి గది నిర్మాణం

గుంటూరు జిల్లా..

గుంటూరు జిల్లాలో 919 పాఠశాలల్లో రూ.203.94 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటికి రూ.111.62 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. 6,523 పనులు చేపట్టగా 2,748 పనులు మాత్రం పురోగతిలో ఉన్నాయి. 2,379 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా పది ప్యాకేజీల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్ నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 100 పాఠశాలలకు ప్రహరీ పనులకు 25 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 397 విద్యుత్ పనులకు 264 పూర్తయ్యాయి. 745 మరమ్మతుల పనులకు 191 పూర్తి చేశారు.

పట్టుదలతో మళ్లీ పోటీ

కారణాలేవైనా 1985 తర్వాత మంగళగిరిలో పసుపు జెండా ఎగరలేదు. దీంతో నియోజకవర్గంలో కొంత నైరాశ్యం ఏర్పడింది. దానిని తొలగించి పార్టీని మళ్లీ యాక్టివ్ చేయాలని భావించా. టీడీపీ బలంగా ఉన్న చోట పోటీ చేసి గెలుపొందడంలో మజా ఏముంది. అందుకే మంగళగిరిలో ఓడినా.. అక్కడే పోటీ చేసి గెలవాలని నిర్ణయించుకున్నా. అనుకున్నది సాధించే వరకు పోరాడడం నా నైజం. అందుకే ముందు ప్రజల హృదయాలను గెలుచుకుని ఆ తర్వాత ఎన్నికల్లో గెలవాలనుకున్నా. ఐదేళ్లుగా నియోజకవర్గంలో పర్యటించి సమస్యలేమిటో తెలుసుకున్నా. ప్రతిపక్షంలో ఉన్నా ఎంతవరకు సాయం చేయాలో అంతవరకు సాయం చేస్తూ 29 రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించా. ఇపుడు ప్రజల హృదయాల్లో నేనున్నానని గర్వంగా చెబుతున్నా.

- ప్రజల హృదయాలను గెలుచుకున్నా
- లక్ష్య సాధన కోసం ఎంతైనా శ్రమిస్తా
- 53,530 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందుతా
- ఆంధ్రజ్యోతితో మంగళగిరి అభ్యర్థి నారా లోకేశ్



నేనేంటో.. తెలుసుకున్నారు..

మంగళగిరి, మే 2: మంగళగిరి ప్రజల ఆదరాభిమానాలతో గెలవాలి. అలా ఇలా కాదు. బంపర్ మెజారిటీతో గెలవాలి. అందుకే ఐదేళ్లుగా మంగళగిరి ప్రజల మధ్య తిరుగుతూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ వారి కోసం పని చేస్తూ వచ్చాను. ఇపుడు నేనేంటో మంగళగిరి ప్రజలకు తెలిసింది. గతంలో ఓడిపోయిన 5350 ఓట్లకు పక్కనే మరో సున్నాను కలుపుకుని 53,530 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందుతా.. అని మంగళగిరి కూటమి అభ్యర్థి నారా లోకేశ్ చెప్పారు. మూడోతరం నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చిన తాను ఏదైనా అనుకుంటే దానిని సాధించే వరకు నిద్రపోనన్నారు. ఆ లక్ష్య సాధన కోసం ఎంతైనా శ్రమిస్తానని చెప్పారు. గత ఓటమిలో సాకులు వెతుక్కోను.. నేనిక్కడే గెలవాలి.. ఇదే తన లక్ష్యమన్నారు. అందుకే ఎవరు ఏమి చెప్పినా నియోజకవర్గం మంగళగిరేనని ఫిక్సయి రెండో సారి రంగంలోకి దిగనట్లు లోకేశ్ చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే భారీ మెజారిటీ ఖాయమన్న భావన కలుగుతోందన్నారు. ప్రచారంలో దూసుకెళ్తున్న లోకేశ్ వివిధ అంశాలపై ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఓటమికి కారణాలు

గతంలో అనుకోకుండా 21 రోజుల ముందు మంగళగిరి బరిలో దిగాల్సి వచ్చింది. సమయం లేకపోవడంతో ప్రజలకు దగ్గరకు కాలేకపోయా. నియోజకవర్గమంతటా సరిగ్గా తిరగలేకపోయా. ఎక్కడెక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో తెలియలేదు. మొత్తంగా ప్రజల గురించి తెలుసుకోలేక పోయా. నా గురించి ప్రజలకు తెలియలేదు. దీంతో ఇద్దరం నష్టపోయాం.

ప్రచారం.. సహకారం

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బిజీగా ఉన్నారు. జయహో బీసీ మంగళగిరిలోనే నిర్వహించాం. బీసీ డిక్లరేషన్‌ను కూడా ఇక్కడి నుంచే ప్రకటించాం. చేనేతలకు ఏమేమి చేస్తామో చంద్రబాబే స్వయంగా ప్రకటించారు. నేను, నా సతీమణి బ్రాహ్మణి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాం. మా పార్టీ శ్రేణులతోపాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాగా సహకరిస్తున్నారు. యువగళానికి ముందు నుంచే పార్టీ శ్రేణులు విస్తృతంగా పర్యటిస్తున్నాయి. ఇప్పటికే మా వాళ్లు డోర్ టూ డోర్ క్యాంపెయిన్ మూడేసి సార్లు పూర్తిచేశారు. ఇపుడు నాలుగోసారి ఇంటింటికి తిరుగుతూ చాలా కష్టపడి పనిచేస్తున్నారు.

మంగళగిరికి జగన్ సున్నా

మంగళగిరిపై జగన్‌కు అంత ప్రేమే ఉంటే ఇక్కడి ప్రజలకు శాశ్వత భూహక్కు పట్టాలను ఎందుకు ఇవ్వలేదు. మంగళగిరి అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.1200 కోట్లను ఎందుకు విడుదల చేయలేదు. మంగళగిరికి జగన్ సున్నా చుట్టేశారు. అందుకే ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిని కూడా మార్చుకోవాల్సివచ్చింది. వేధింపుల ముఖ్యమంత్రిని వదిలించుకోవాలని ప్రజలు చాలాక్లియర్‌గా ఉన్నారు.

జర్నలిస్టుల హక్కులు కాపాడతాం

జర్నలిస్టుల హక్కులను కాపాడతాం. జర్నలిస్టుల స్వేచ్ఛను హరించేలా జగన్ తెచ్చిన జీవో 37ను రద్దు చేస్తాం. తప్పొప్పులను ఎత్తిచేపే బాధ్యత ఉన్న జర్నలిస్టులపై పరిమితులు విధించడం సహేతుకం కాదు. జర్నలిస్టులకు గతంలో ఉన్న అన్ని పథకాలను పునరుద్ధరిస్తాం. నివేశన స్థలాలతో పాటు పక్కా గృహాలను కూడా కట్టించి ఇస్తాం.

కష్టపడే వారికి గుర్తింపు

పార్టీలో కష్టపడి పని చేసేవారికి తప్పకుండా తగిన గుర్తింపు ఉంటుంది. టీడీపీ క్లస్టర్ యూనిట్ బూత్‌ల బాధ్యతలను అప్పగించాం. గతంలో మెజారిటీ వచ్చినచోట ఇంకా మెరుగైన మెజారిటీ.. అలాగే మైనస్ వచ్చిన చోట మెరుగైన ఫలితాలను తీసుకు రావాలని వారికి లక్ష్యాలుగా నిర్ణయించాం. కష్టపడి పనిచేసేవారికి పెద్దపీట వేస్తాం. సీనియారిటీని గౌరవిస్తాం. అదే సందర్భంలో పనిచేసే జూనియర్లను ప్రోత్సహిస్తాం.

యూ-వన్ జోన్ సమస్యపై ..

యూ-వన్ జోన్‌పై జగన్ పనికిరాని జీవో ఇచ్చారు. మేము అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లో యూ-వన్ జోన్ సమస్యను పరిష్కరిస్తాం.

ప్రాధాన్యతా అంశాలు

మంగళగిరిలో దశాబ్దాల తరబడి ఏడు రకాలైన ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు శాశ్వత భూహక్కు కల్పించడం నా బాధ్యత. నిరుపేదలందరికీ ఇళ్లను నిర్మించి తాళాలు అప్పగిస్తా. భూగర్భ డ్రెయినేజి నిర్మించడం, సురక్షితమైన తాగునీటిని గడపగడపకు అందించడం, సీసీ రోడ్లు, పార్కుల నిర్మాణం, ఆటస్థలాలు ఏర్పాటు చేస్తా. మంగళగిరిని దక్షిణ భారతంలోనే అతిపెద్ద గోల్డ్‌హబ్‌గా తీర్చిదిద్దుతా. పరిశ్రమలను తీసుకువచ్చి మంగళగిరి యువతకు ఇక్కడే ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తా. ఈ ప్రాంతంలో గంజాయిని సమూలంగా నిర్మూలించి బాలల జీవితాలను కాపాడడం కూడా నా బాధ్యతే.

అక్కసుతో.. ఆపేశారు

- టీడీపీకి పేరొస్తుందని యూజీడీపై నిర్లక్ష్యం
- భూగర్భంలో మురిగిపోతున్న రూ.వందల కోట్లు
- ఐదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వని జగన్ ప్రభుత్వం
- షాపూర్‌జీ పల్లోంజీ సంస్థని తరిమేసిన వైసీపీ పాలకులు
- కేంద్రం నుంచి రూ.540 కోట్లు మంజూరు చేయించిన చంద్రబాబు
- స్కీమ్ పూర్తి అయితే గుంటూరుకి మురుగు సమస్య తీరిపోయేదే



యూజీడీ కోసం తవ్విన రోడ్లు (పాతచిత్రం)

గుంటూరు, మే 2 (ఆంధ్ర జ్యోతి): ఓ మోస్తరు వర్షాలకే పొంగి ప్రవహించే డ్రెయి న్లు.. తటాకాలను తలపిం చేలా రోడ్లు.. అపరిశుభ్రతకు నెలవుగా ఓపెన్ డ్రెయిన్లు.. దోమలు ఉధృతి.. దుర్వాసన.. ఇదీ ఘనత వహించిన గుంటూరు నగరంలోని పరిస్థితి. అమరావతి జిల్లా కేంద్రంగా మారిన గుంటూరులోని ఈ దుర్భర పరిస్థితిని మార్చాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) స్కీమ్‌ని తీసుకొచ్చింది. కొంత మేర పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే అది పూర్తి అయితే నగర ప్రజలు మనస్సుల్లో ఎక్కడ టీడీపీ శాశ్వతంగా ముద్ర వేసుకొంటుందోనన్న అక్కసుతో ఆ స్కీమ్‌ని వైసీపీ ప్రభుత్వం శిథిలం చేసింది. ఏడున్నర లక్షల మంది జనాభా అవసరాలకు ఉపయోగపడే ఈ యూజీడీ స్కీమ్‌కి జగన్ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. యూజీడీ పనులు చేసి దేశవ్యాప్తంగా పేరు గడించిన షాపూర్‌జీ పల్లోంజీ సంస్థని ఈ రాష్ట్రం నుంచే తరిమేసింది. దీంతో రూ.వందల కోట్లు ప్రస్తుతానికి భూగర్భంలో మురిగిపోతున్నాయి. మరింత జాప్యం జరిగితే అవి వృథా అయ్యే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో మూడో పెద్ద నగరమైన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంచుమించుగా 7.50 లక్షలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. గతంలో రూరల్ మండలంలో ఉన్న బుడంపాడు, ఏటుకూరు, చౌడవరం, అంకిరెడ్డిపాలెం, గోరంట్ల, నగరాలు వంటి గ్రామాలు గుంటూరు నగర పాలక సంస్థలో విలీనం అయ్యాయి. దీంతో గ్రేటర్ గుంటూరుగా రూపాంతరం చెందుతోన్నది. అయితే నేటికీ చాలా ప్రాంతాల్లో ఓపెన్ డ్రెయినేజీ సిస్టమ్ కావడంతో చాలా వీధులు దుర్వాసన వెదజల్లుతుంటాయి. వర్షం వస్తే మురుగునీటి కాలువలు ఉప్పొంగి రోడ్ల పైకి ప్రవహిస్తుంటాయి. ఇక దోమల ఉధృతి వేసవిలోనూ నగర ప్రజలకు తప్పని పరిస్థితి. వీటిని దృష్టిలో పెట్టుకుని గత టీడీపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వ్యవహరించిన ఎం వెంకయ్యనాయుడు గుంటూరు నగర యూజీడీ స్కీమ్ కోసం రూ.540 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేశారు. యూజీడీ స్కీమ్‌ని రూ.903 కోట్లతో పూర్తి చేయడానికి పరిపాలన అనుమతులు కూడా వచ్చాయి. కేంద్రం గ్రాంట్ పోగా మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, గుంటూరు నగరపాలకసంస్థ భరించాల్సి ఉంటుంది. కాగా టీడీపీ ప్రభుత్వం వేగవంతంగా టెండర్లు నిర్వహించి దేశంలోనే ప్రముఖ నగరాల్లో యూజీడీ స్కీమ్‌ని నిర్మించిన షాపూర్ జీ పల్లోంజీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. 2018 డిసెంబరు నాటికే పనులు పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకుని నెలకు 75 కిలోమీటర్ల చొప్పున పైపులైను వర్కులను పూర్తి చేసింది. మొత్తం ఐదు జోన్లుగా నగరాన్ని విభజించి ట్రీట్‌మెంట్ ప్లాంట్లను కూడా డిజైన్ చేశారు. దాదాపుగా 1,038 కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు నిర్మించాల్సి ఉన్నది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల పనులు ఆలస్యం కాగా ఈలోపు 2019 ఎలక్షన్స్ వచ్చాయి. ఆ ఎన్నికల్లో గెలుపొందిన వైసీపీ అధికారంలోకి వస్తూనే యూజీడీ పనులను నిలిపేసింది. నిర్మాణ సంస్థని ఇక్కడి నుంచి పారద్రోలింది. ఆ తర్వాత ఒక్క పనిని కూడా చేపట్టలేదు. 2032 నాటికి 10.50 లక్షల మంది ప్రజలు ఇక్కడ నివసిస్తారని అంచనా వేసి నిర్మాణం చేపట్టిన బృహత్తరమైన ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే టీడీపీ ప్రభుత్వానికి ఎక్కడ మంచిపేరు వస్తుందనో భయపడి వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా పనులను మరుగున పడేసింది. గతంలో ఏ ప్రభుత్వాలు ఇలా వ్యవహరించిన దాఖలాలు లేవు. ఏదైనా ప్రాజెక్టుని ఒక ప్రభుత్వం ప్రారంభించి దాని హయాంలో పూర్తి చేయలేకపోతే ఆ తర్వాత వచ్చిన సర్కారు ఆ పనిని పూర్తి చేసి కొత్త వాటి జోలికి వెళ్లేది. ఆ స్ఫూర్తి లేకుండా యూజీడీ స్కీమ్‌ని పక్కన పడేయడం వైసీపీ మార్కు పాలనకు అద్దం పడుతున్నదని నగర ప్రజలు విమర్శిస్తున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణదేవరాయలు

సాగు నీరు కావాలా.. సారా కావాలా?

- ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

బెల్లంకొండ, మే 2: ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు తాగు నీరు కావాలా? సారా కావాలా? అని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు ప్రశ్నించారు. గురువారం బెల్లంకొండ మండలంలోని గంగిరెడ్డిపాలెం, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, న్యూ చిట్యాల, చంద్రాజుపాలెం, కందిపాడు, పాపాయపాలెం గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పెదకూరపాడు ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ నీరు అందుతుందని, వైసీపీకి ఓటు వేస్తే సారా తయారవుతుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కావాలన్నా, పరిశ్రమలు రావాలన్నా నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆయన సూచించారు. బెల్లంకొండ గ్రామంలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అలాగే బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని బుడగ జంగాల పెద్దలు కోరారు. అధికారంలోకి రాగానే ఆయా సమస్యల పరిష్కారినికి కృషిచేస్తామన్నారు. పెదకూరపాడు టీడీపీ అభ్యర్ది బాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అన్నివర్గాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాలని సూచించారు. వైసీపీని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గుంజా గంగారావు, నాగమణి బాయి, రమాదేవి, వీరాంజనేయులు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని సవాల్‌ని స్వీకరించే దమ్ముందా ?

- టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు,మే 2(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఆస్తుల సంపాదనపై గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విసిరిన సవాల్‌ను స్వీకరించాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. గురువారం గుంటూరులోని డాక్టర్ పెమ్మసాని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డబ్బు కోసం, పదవుల కోసం హత్యలు చేయటం.. చేయించటం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. జగన్ నీలి మీడియాలో పెమ్మసానిపై తప్పుడు కథనాలు ప్రసారం చేయటంపై తీవ్రంగా మండిపడ్డారు. తాత రౌడీషీటర్, తండ్రి ఫ్యాక్షనిస్టు, ఆయన ఆర్థిక నేరస్తుడు.. స్థూలంగా వైఎస్ కుటుంబ చరిత్ర ఇదని దుయ్యబట్టారు. పెమ్మసాని, వైఎస్ కుటుంబం ఆర్థికంగా ఎది గిన తీరుపై వైసీపీ నేతలకు దమ్ముంటే బహిరంగచర్చకు రావాలని సవాల్ విసిరారు. పెమ్మసాని మాటల తూటాలకు తాడేపల్లి ప్యాలెస్ కంపించిపోతుం దన్నారు. పదవ తరగతి పేపర్ లీకేజ్ కేసులో జైలుపాలైన జగన్‌కు, ఎంసెట్ మెడికల్ విభాగంలో 26వ ర్యాంక్ సాధించిన పెమ్మసానికి పోలికేంటని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి డిగ్రీ ఎక్కడ చదివాడో ఈ రోజుకు కూడా సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయిందని ఎద్దేవాచేశారు. తినటానికి తిండిలేక బలప నూరు నుంచి పులివెందులకు వలస పోయిన నీ కుటుంబ చరిత్ర కడప జిల్లా ప్రజలకు తెలియంది కాదన్నారు. నీ తాత రాజారెడ్డిని పులివెందుల నడిరోడ్డులో ఎందుకు హత్య చేశారో, నీ తండ్రి రాజశేఖరరెడ్డిపై హైదరాబాద్ సచివాలయంలో కాల్పులు ఎందుకు జరిగాయో సమాధానం చెప్పాలని జగన్‌ను కనపర్తి డిమాండ్ చేశారు. వైఎస్ కుటుంబ రక్త చరిత్ర దేశ ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడకా శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

భావితరాల కోసం ఓటు వేయండి

- డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- కూటమి పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశం


కొలకలూరులో ప్రసంగిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, మే1: కులాలు, మతాలు, వర్గాలు అంటూ ప్రజల్లో విభేదాలు పెట్టి అధికారంకోసం పోరుకులాడే వైసీపీ రాజకీయాలు మనకు వద్దని రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకోసం, భావితరాల కోసం పాటుపడే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్ర మోదీల కూటమికి ఓటు వేయాలని గుంటూరు పార్లమెంటరీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.


గురువారం మండలంలోని నందివెలుగులో ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో పెమ్మసాని చంద్రశేఖర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రాంతం వాడినేనని చెప్పుకొనే కిలారి రోశయ్య.. జగన్ మోహన్‌రెడ్డి మూడు రాజధానులంటే దానిని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. రాజధాని అమరావతిగా అభివృద్ధి చెంది ఉంటే గుంటూరు ప్రాంతం ఇప్పటికే అనేక రంగాల్లో అగ్రగామిగా నిలిచేదన్నారు. కనీసం ఐదేళ్ళలో రోడ్లు కూడా వేయలేని అసమర్థపు ప్రభుత్వం వైసీపీ కాదా అని సూటిగా ప్రశ్నించారు. కిలారి రోశయ్యపై తనకు ఎటువంటి వ్యక్తిగత విభేదాలు లేవని కేవలం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని జీర్ణించుకోలేకే మాట్లాడానన్నారు. కులాలు మతాల మధ్య చిచ్చుపెట్టడం ద్వారా ప్రాంతాలు అభివృద్ధి చెందకపోగా ప్రజల్లో సోదరభావం పోయి విద్వేశాలు పెరుగుతాయన్నారు. వైసీపీ పాలనలో వర్గాల పోరు తప్ప ప్రజలకు రాష్ట్రానికి చేసే మంచి ఒక్కటైనా చేయలేకపోయారని విమర్శించారు. ఉమ్మడి పార్టీల ఆలోచన ఒక్కటే నన్నారు. అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి వెలుగులు నింపుకోవాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని, రైతుల ఇంట ధాన్యపు సిరులు నింపాలని, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలతో సంతోషాలు నింపాలని అని అన్నారు. అదే విధంగా నైపుణ్య శిక్షణాతరగతుల ద్వారా యువతలో స్వశక్తితో బతకగలమనే నమ్మకాన్ని పెంచాలని, మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వారితో చిన్నపరిశ్రమలు పెట్టించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికతో ముందుకు నడపాలని, పూరి గుడిసెల్లో ఉన్న పేదలకు మంచి ఇల్లు కట్టించి వారిలో సంతోషాన్ని చూడాలని ఇలా అన్ని రకాలుగా ప్రజలందరికీ ఉపయోగపడే పనులు చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల బరిలో మీ ముందుకు వచ్చామన్నారు. తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి మీ అభిమానం పొందారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనను తిరిగి గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థిగా ఉన్న తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. నందివెలుగులో ఉన్న హైస్కూల్ నిర్మాణపనులు, డొంకరోడ్లు వంటివాటిని అధికారంలోకి వచ్చిన తరువాత బడ్జెట్‌ను బట్టి ఆరునెలలు లేదా సంవత్సరంలో పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. ప్రజలందరూ ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని భావితరాల భవిష్యత్తును కాపాడాలని పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ బకాయిలు జమ చేస్తాం

- చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు
- సంక్షేమ కార్యక్రమాలు ఏ ఒక్కటి ఆగవు : లావు రత్తయ్య


తుర్లపాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి

యడ్లపాడు, మే 2 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రెండు విడతల రైతు రుణమాఫీ బకాయిలు మొత్తాన్ని ఆయా రైతుల ఖాతాల్లో జమచేస్తామని, ఈ విషయంలో పార్టీ అధినేత స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం రాత్రి యడ్లపాడు మండలంలోని సందెపూడి, తుర్లపాడు, గణేశునివారిపాలెం గ్రామాలలో సినీ నటుడు శివాజీ, విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ లావు రత్తయ్యలతో కలసి ప్రత్తిపాటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారానికి వచ్చిన నాయకులకు మహిళలు, రైతులు, యువకులు, పార్టీ అభిమానుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ప్రచార రథంపై రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టో చూశాక వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయన్నారు. 50 ఏళ్ళు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రూ.4వేలు పింఛన్, ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు హామీ ఎంతో సాహసోపేతమైనవిగా అభివర్ణించారు. ఆడబిడ్డలకు ఉచితంగా బస్సు సౌకర్యంతో పాటు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించి తీరతామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, అన్నదాతలకు ఏడాదికి రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. లావు రత్తయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు ఒక్కటి కూడా ఆగవని, ఇంకా మెరుగ్గా ఉంటాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే పిల్లలకు మంచి చదువులు చదివించేందుకు వీలవుతుందన్నారు. రైతుల భూములు, పత్రాలు వారి స్వాధీన హక్కుభుక్తంలో ఉండాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. సినీ నటుడు శివాజీ మాట్లాడుతూ బీసీ మహిళను అని చెప్పుకుంటూ మా బీసీలను విడదల రజిని వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ఎంతో నమ్మకంతో గెలిపిస్తే చరిత్రలో మర్చిపోలేని విధంగా మా బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీలపైనే అక్రమ కేసులు పెట్టించిందని, నమ్మక ద్రోహానికి రజిని కేరాఫ్ అన్నారు. గత ఐదేళ్ళలో రజిని చేసిన అక్రమాలపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రెంటచింతలలో ఎండ.. చురచుర

- 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రెంటచింతల, మే 2: సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రోహిణికి ముందే రోళ్ల పగిలే ఎండలు కాస్తున్నాయి. రెంటచింతలలో గురువారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 47 డిగ్రీలుగా నమోదైంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రెంటచింతల అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన ప్రాంతం. ఇక్కడ ఎక్కువగా వందలాది ఎకరాల్లో నాపరాయి క్వారీలుండడమే వేడికి కారణం. వృద్ధులు, చిన్నపిల్లలు, వ్యాధిగ్రస్తులు, వేడిని భరించలేక అవస్థ పడుతున్నారు. రాత్రి 9 గంటలైనా వేడి గాలులు వీస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం వలన ఎండలు ఎక్కువగా ఉంటున్నాయి.


మద్యంతో పట్టుబడిన వైసీపీ సర్పంచ్ రామారావుతో సెబ్ అధికారులు

మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వైసీపీ సర్పంచ్

- ఆకస్మిక తనిఖీతో బార్ సీజ్, కేసు నమోదు
- 1056 మద్యం బాటిల్స్ స్వాధీనం

పిడుగురాళ్ల, మే2: అక్రమంగా మద్యం తరలిస్తున్న వైసీపీ సర్పంచ్‌ని పల్నాడు జిల్లా ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. కొండమోడు వద్ద గల పల్నాడు బార్ అండ్ రెస్టారెంట్ నుంచి 1056 మద్యం బాటిల్స్‌ను పిడుగురాళ్ల మండలం వీరాపురం గ్రామ వైసీపీ సర్పంచ్ సుంకర విజయరామారావుకు చెందిన వాహనంలో మరో వ్యక్తితో కలిసి వాహనంలో లోడ్ చేస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్, పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, ట్రైనీ ఐపీఎస్ కల్పశ్రీ సిబ్బందితో దాడి చేసి మద్యం సీసాలు, వైసీపీ ప్రచార కరపత్రాలు కలిగివున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2 లక్షల వరకు వుంటుందని కల్పశ్రీ తెలిపారు. పల్నాడు బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ విజయరామారావు, కేశానుపల్లి గ్రామస్థుడు గణేష్‌బాబుపై కేసు నమోదు చేసినట్లు సెబ్‌సీఐ సూర్యనారాయణ తెలిపారు.


టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ శిరిగిరి గోపాళరావుతో కన్నా

సైకిలెక్కిన వైసీపీ జడ్పీటీసీ శిరిగిరి

ముప్పాళ్ళ మే 2: వైసీపీ జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ మరిది శిరిగిరి గోపాళరావు గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సత్తెనపల్లి కన్నా కార్యాలయంలో శిరిగిరి గోపాళరావుకు కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు గెలుపునకు కృషిచేస్తానని గోపాళరావ అన్నారు. శిరిగిరి గోపాళరావుకు సన్నిహితులు, అనుచరులు, ప్రజాప్రతినిధులు త్వరలో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

వైసీపీకి అమరావతి ఎంపీపీ రాజీనామా

అమరావతి, మే2: రాష్ట్ర పంచాయితీరాజ్ వింగ్ మాజీ అధ్యక్షుడు, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు తన అనుచరులతో కలసి వైసీపీకి గుడ్‌బై చెప్పారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన హనుమంతరావు తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డికి పంపిస్తున్నట్లు తెలిపారు. గురువారం హనుమంతరావు ఇంటి వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంఎల్‌ఏ నంబూరు శంకరరావు 18నెలలుగా తన ఎదుగుదలను ఓర్చుకోలేక అణచివేత ధోరణి వ్యవహరించారని పార్టీ కార్యాక్రమాలకు పిలవకుండా అవమాన పర్చారన్నారు. ఈవిషయమై పార్టీ నాయకత్వానికి తెలిపినా పట్టించుకోలేదని అన్నారు. అనిల్‌యాదవ్ కూడా ఎమ్మెల్యే మాటలు విని తనపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో శంకరరావు, అనిల్‌కుమార్ యాదవ్‌ను ఓడించే విధంగా పల్నాడు జిల్లా పరిధిలో పనిచేస్తానని అన్నారు.

11 నుంచి జూన్ 9 వరకు

మిర్చియార్డుకు వేసవి సెలవులు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ వేసవి సెలవుదినాలను ప్రకటించింది. ఎండల తీవ్రత పెరగడంతో మిర్చియార్డులో పనులుచేయడం కార్మికులకు కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో వివిధ యూనియన్ల విజ్ఞప్తి మేరకు ప్రతీ సంవత్సరం వలే ఈ నెల 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు వేసవి సెలవుదినాలను మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు ప్రకటించారు. దీని దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఈ నెల 10వ తేదీ రాత్రి వరకే యార్డుకు సరుకు విక్రయానికి తెచ్చుకోవాలన్నారు. సెలవుదినాల అనంతరం జూన్ 10న యార్డు పునఃప్రారంభమౌతుందన్నారు. దీని దృష్ట్యా జూన్ 9వ తేదీ రాత్రి నుంచి యార్డులోకి సరుకు అనుమతిస్తామన్నారు. మిర్చి లావాదేవీలకు మాత్రమే సెలవులని, యార్డులో అధికారిక కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయన్నారు.

రాజధాని లేకుండా రాష్ట్ర ప్రగతి ఎలా జగన్ ?

- 1598వ రోజుకు రైతుల ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 2: రాజధాని లేకుండా రాష్ట్రాభివృద్ధిని ఎలా సాధిస్తావు జగన్‌రెడ్డి అని అమరావతి రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు ప్రశ్నించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు గురువారం నాటికి 1598వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా రైతు ధర్నాశిబిరాల నుండి పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతికి కేంద్ర బిందువైన రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేసిన వైసీపీని ఓడించి జగన్‌కు బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. అదే సందర్భంలో విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజల కలలు సాకారమవుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలందరిపై ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని గ్రామాల్లో నిరసనలు కొనసాగాయి.


మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

కిలారిని మించిన మాఫియా డాన్ మురళి

- సత్తెనపల్లిలో జనసైనికులపై వేధింపులు
- అంబటి రాంబాబు షాడో ఎమ్మెల్యేగా మురళీ..
- పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజం

పొన్నూరుటౌన్,మే2: ఎమ్మెల్యే కిలారిని మించిన మైనింగ్ మాఫియా డాన్ అంబటి మురళీకృష్ణ అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. గురువారం చింతలపూడి డీవీసీ కల్యాణమండపంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సత్తెనపల్లిలో అంబటి మురళీ చేసిన అరాచకాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సత్తెనపల్లిలో అంబటి రాంబాబు షాడో ఎమ్మెల్యేగా మురళీ వ్యవహరించారని దుయ్యబట్టారు. ఆయన కన్నుపడిన గుట్టలు, కొండలు కనుమరుగైపోయాయని అన్నారు. నకరికల్లు మండలం, త్రిపురాపురం, గుండ్లపల్లి కొండలను ఇష్టారాజ్యంగా తవ్వి ఎర్రమట్టి గ్రావెల్‌ను దోచుకున్నారని ఆరోపించారు. పొన్నూరు నియోజకవర్గంలో చేబ్రోలు మండలంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఏస్థాయిలో గ్రావెల్ మాఫియాను నడిపించాడో సత్తెనపల్లిలో అంబటి మురళీ అంతకు మించి మాఫియాను నడిపారన్నారు. పొన్నూరు వచ్చి జనసైనికులను ఉద్ధరించినట్లు మాట్లాడుతున్న మురళీ సత్తెనపల్లిలో ఉన్న మూడేళ్ల కాలంలో జనసైనికులపై చేసిన దాడులు అరాచకాలు అడ్డుఅదుపు లేవన్నారు. అలాగే ఒక ప్రముఖ మీడియాలో కుటుంబాలను అంబటి కూల్చి కాపురాలను విచ్ఛిన్నం చేసిన కథనం సంచలనంగా మారిందన్నారు. అంబటి మురళీకృష్ణ సత్తెనపల్లి నుంచి ఎందుకు బయటకు వచ్చాడో చెప్పే దమ్ము ధైర్యం ఉందా అని నిలదీశారు. మురళీలోలుడు అయితే చాలు, మురళీని ప్రసన్నం చేసుకుంటే చాలు ఏమైనా చేయవచ్చు అంటూ వచ్చిన కథనాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. అధికారం ఉపయోగించి ఇంటర్నెట్‌లో కథనాలు తొలగించిన చరిత్రను మార్చలేరన్నారు. ఈ అంబటి మురళీ నిజస్వరూపాన్ని గుర్తించి పొన్నూరు ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏషియన్ పోటీలకు ముగ్గురు లిఫ్టర్లు

మంగళగిరి సిటీ, మే 2: హాంకాంగ్‌లో ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనే భారత జట్టుకు గుంటూరు జిల్లా మంగళగిరి ఫిట్ జోన్‌లో శిక్షణ పొందుతున్న ముగ్గురు లిఫ్టర్లు ఎంపికైనట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. తెనాలికి చెందిన షేక్ షబీనా ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 84 కిలోల జూనియర్స్ విభాగానికి, ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన పి.భరత్ కుమార్ (కృష్ణా యూనివర్సిటీ) 59 కిలోల విభాగానికి, మంగళగిరికి చెందిన షేక్ ఆసియా (వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం) 69 కిలోల విభాగంలో పోటీ పడేందుకు ఎంపికయ్యారని చెప్పారు. భరత్‌కు విజయవాడ కేబీఎన్ కళాశాల, షబీనాకు తాడేపల్లి నులకపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలు ఆర్థిక సహకారం అందించారని పేర్కొన్నారు. ఎంపికైన పవర్ లిఫ్టర్లను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

నగదు, జెండాలు సీజ్

గుంటూరు(తూర్పు), మే 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా తాడికొండ నియోజకవర్గంలో రూ.2,23,660 నగదు, గుంటూరు తూర్పులో రూ.60,500 విలువైన 12వేల జెండాలు,టవల్స్ సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో మే 2వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.2,75,43,087 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

గుంటూరు సిటీ వార్తలు


ప్రజాదీవెన యాత్రలో ప్రచారం చేస్తున్న నసీర్

చంద్రబాబుతోనే మైనారిటీల అభ్యున్నతి

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు అంబేడ్కర్‌నగర్‌లో ఆయన చేపట్టిన ప్రజాదీవెన యాత్ర కొనసాగింది. ఈ యాత్రలో ఇంటింటింటికి తిరుగుతూ ఉమ్మడి పార్టీ మేనిఫెస్టోను ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో చంద్రబాబు నాయుడు రోడ్ షో జరిగిందని అన్నారు. ప్రజలంతా చంద్రబాబుకు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు మంచి జరిగిందంటే అది తెలుగుదేశం ప్రభుత్వంలోనేనని గుర్తు చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైసీపీని తరిమేయటానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. అంబేద్కర్‌నగర్‌లో అభివృద్ధి అటకెక్కిందని, ప్రజలు కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని, దశాబ్దాల కాలంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారికి పట్టాలు లేవని, పేద, మధ్య తరగతి వారు ఎక్కువగా ఉన్న ప్రాంతమని, కచ్చితంగా కూటమి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే వారందరికీ, రిజిస్ట్రేషన్లు చేయించే బాధ్యత తీసుకుంటామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వేల్పూరి కిరణ్, దుర్గా ప్రసాద్, రోశయ్య, రమాదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంలో చేరిన సయ్యద్ చాంద్


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చాంద్

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ నేత, సామాజిక వేత్త సయ్యద్ చాంద్ తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చాంద్ మాట్లాడుతూ దశ, దిశ లేని ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చే సమర్థత చంద్రబాబుకే ఉందన్నారు. ఆ విశ్వాసంతోనే తాను పార్టీలో చేరానన్నారు. టీడీపీ అభ్యర్థుల గెలుపునకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తనకు సహకరించిన గల్లా మాధవి, నసీర్, నాని, సుఖవాసి శ్రీనివాస్, సీతయ్య, నవరం రోహిత్, ఆళ్ళ హరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుతోనే ముస్లిం, మైనార్టీల సంక్షేమం

● ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి

గుంటూరు(తూర్పు), మే 2 : చంద్రబాబు పాలనలోనే ముస్లిం, మైనార్టీల సంక్షేమం జరిగిందని, జగన్ ఆధ్వర్యంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి అన్నారు. గురువారం తూర్పు నియోజకవర్గంలోని మద్దిరాల కాలనీలో ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోరుతూ సంఘ నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజావలీ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అవగాహన ఉండి, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ అహ్మద్, గల్లా మాధవిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముస్లింలకు ప్రత్యేకించి ఏ ఒక్క పథకం రాష్ట్రంలో అమలు జరగడం లేదని మండిపడ్డారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు చేరాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రచారంలో ఎస్ ఎమ్ బాషా, షేక్ షాకీర్, షేక్ యాసిన్, షేక్ జరీనా, షేక్ గౌసియా పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న షేక్ ఖాజావలి, పాల్గొన్న సంఘ నాయకులు

దళితుల అభివృద్ధిని అడ్డుకుంటున్న జగన్

● సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి

గుంటూరు(తూర్పు), మే 2: దళితుల అభివృద్ధిని ఉద్దేశ్యపూర్వకంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అడ్డుకుంటున్నాడని హైకోర్టు ప్రముఖ న్యాయవాది, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు అన్నారు. బ్రాడీపేటలోని ఓ హోటల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ నిర్వాకంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది దళిత విద్యార్థులు చదువుకు దూరమయ్యారని విమర్శించారు. నాడు-నేడు అనే కార్యక్రమం ఒక బూటకమన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి జగన్ పేరు పెట్టటం ఏమిటని, అంబేద్కర్ కంటే జగన్ గొప్పవాడా అంటూ ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితుల భూములను అక్రమంగా లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువస్తే ఎస్సీలను హత్యలు చేసి శవాలను ఇళ్లకు పంపించిన ఘనుడు జగన్‌మోహనరెడ్డి అని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను మొత్తం రద్దు చేసి రూ.70 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించారన్నారు. వైసీపీకి మాత్రం ఓటు వేయవద్దని అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఆర్.నాగేశ్వరరావు, కే.దయసాగర్, లంకపల్లి కోటేశ్వరరావు, జువ్వాజి ఫణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలేటి మహేశ్వరరావు, పాల్గొన్న నాయకులు



అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ ..

● యనమల రామకృష్ణుడు

క్రోసూరు, మే 2 : రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. గురువారం రాత్రి క్రోసూరులో జరిగిన బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే బీసీల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. అనంతరం టీడీపీ నాయకులు యనమల రామకృష్ణుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య, సంగం డెయిరీ మాజీ చైర్మన్ రాజన్ బాబు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న జగన్‌రెడ్డి

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి


గల్లా మాధవికి పూలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : గెలిపించిన పాపానికి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిరుద్యోగుల జీవితాలతో ఐదేళ్లుగా ఆడుకొంటున్నారని గల్లా మాధవి విమర్శించారు. టీడీపీ చేపట్టిన నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర గురువారం పశ్చిమ నియోజకవర్గం చేరుకోగా పార్టీ నేతలతో కలిసి ఆమె స్వాగతం పలికారు. అనంతరం నల్లచెరువు 20వ డివిజన్‌లో నిరుద్యోగ యువతతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, దందాలు, భూకబ్జాలు, అరాచక పాలనను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలన్నా, విద్యార్థులు ఆనందంగా ఉండాలన్నా, యువకులకు ఉద్యోగాలు రావాలన్నా అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే పెట్టటాన్ని ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను పెడదోవపట్టిస్తున్న వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ రబ్బానీ, రావిపాటి సాయికృష్ణ, మొహమ్మద్ రఫీ, సయ్యద్ ఆదంసా, కరిమున్, అహ్మది, నల్లమేకల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు సిద్ధార్థ గార్డెన్స్‌లో చార్టెడ్ అకౌంట్స్ ఇంజనీర్లతో జరిగిన ఆత్మీయ సమావేశం అనంతరం 45వ డివిజన్ ముత్యాలరెడ్డి నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో గల్లా మాధవి పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వరావు, దామచర్ల శ్రీనివాస్, బెజవాడ కృష్ణ రెడ్డి, షేక్ రఫీ, సాయి తదితరులు పాల్గొన్నారు. అరండల్‌పేట ఒకటో లైనులోని షిరిడీ సాయిబాబా గుడిలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో గల్లా మాధవి పాల్గొన్నారు. సాయి సన్నిధిలో పూజ చేసి, స్వయంగా భక్తులకు వడ్డన చేశారు.


నిరుద్యోగ చైతన్య బస్సు యాత్రలో పాల్గొన్న గల్లా మాధవి

నియంతృత్వ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే కూటమికి మద్దతు

● బీసీ సంక్షేమ సంఘం నేత కుమ్మర క్రాంతి కుమార్

గుంటూరు, మే 2: రాష్ట్రంలో నియంతృత్వ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మద్దతు తెలియజేసిందని సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. చుట్టుగుంట బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నా బీసీలు అంటూనే బీసీలపై వరుస దాడులు జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక నియంత పాలన జరుగుతుందనడానికి ఉదాహరణ పుంగనూరులో రామచంద్రయ్య యాదవ్‌పై జరిగిన దాడేనని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రామచంద్రయ్య యాదవ్‌పై పుంగనూరు నియోజకవర్గంలో అనేకసార్లు దాడులు జరిగాయని, ఎన్నికల కమిషన్ ఈ అంశంపై లోతుగా విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎవరు ఏ ఉద్యమం చేపట్టినా అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో నిలదీసిన ప్రతి ఒక్కరిపై దాడులు చేయటమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పూర్తిగా నశించిపోయిన ప్రజాస్వామ్యం

● టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా నశించిపోయిందని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేశారని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ధ్వజమెత్తారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా నేతలు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దళితుల మేనమామ అని చెప్పుకున్న జగన్‌రెడ్డి నియంత పాలనలో దళితులు వెనకబడ్డారని అన్నారు. దళితులపై దాడులు చేసి వారి మరణాలకు కారణమైన వైసీపీ నాయకులకు పదవులు ఇచ్చి కంసమామగా తయారయ్యాడన్నారు. టీడీపీ హయాంలో అమలు పరిచిన 27 ఎస్సీ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కమిటీ సభ్యులు బత్తుల భాస్కర్, యర్రంశెట్టి గిరి, ఎస్సీ నాయకులు కంచర్ల దేవా, మచ్చు దేవా, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా పోలింగ్ సమయాన్ని పొడిగించాలి

గుంటూరు, మే 2 : మండు వేసవి నేపథ్యంలో త్వరలో జరుగనున్న ఎన్నికల పోలింగ్ సమయాన్ని రాత్రి 8 గంటల వరకు పొడిగిస్తే వృద్ధులకు సౌలభ్యంగా ఉంటుందని ఆర్టీసీ విశ్రాంత అధికారి వీఎస్ఎస్ఎల్ మల్లేశ్వరరావు కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించేలా అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మద్యం తాగి వచ్చే వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేయాలన్నారు. చాలా మంది తాగి ఓటు వేయటానికి వచ్చి ఆ మత్తులో ఎవరికి ఓటు వేస్తున్నారో తెలియకుండా వేస్తున్నారన్నారు. కొందరు పోలింగ్ సిబ్బంది, అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేస్తే మద్యం తాగిన వారిని వెనక్కి పంపించే వీలుంటుందన్నారు.

రైల్వే టిక్కెట్లు రిజర్వేషన్ చేయిస్తానంటూ మోసాలు

● కర్నూలు జిల్లాకు చెందిన యువకుడి అరెస్టు

గుంటూరు, మే 2 : రైల్వేస్టేషన్‌లో టిక్కెట్లు రిజర్వేషన్ చేయిస్తానని నమ్మిస్తూ ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్న కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలానికి చెందిన కే.విజయ్ కుమార్ అనే యువకుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు గురువారం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు నిందితుడు విజయ్ కుమార్‌ను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలను వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన విజయకుమార్ డిగ్రీ వరకు చదువుకొని చెడు అలవాట్లకు లోనయ్యాడు. అందుకు అవసరమైన డబ్బులు కోసం రైల్వే స్టేషన్లలో ప్రయాణికులను మోసం చేస్తున్నాడు. రైల్వేస్టేషన్లో రిజర్వేషన్ కౌంటర్స్ వద్ద రిజర్వేషన్ చేయించుకునే ప్రయాణికుల వద్దకు వెళ్లి రిజర్వేషన్ కౌంటర్లో నాకు తెలిసిన ఉద్యోగి ఉన్నాడని, నేను రిజర్వేషన్ చేయిస్తానని ప్రయాణికులను నమ్మిస్తూ మోసపూరితంగా వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తూ నకిలీ రిజర్వేషన్ టికెట్లు ఇస్తూ ఉండగా గురువారం గుంటూరు రైల్వే పోలీసులు నిందితుడు విజయకుమార్‌ను అరెస్టు చేసారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద గాని, బయటగానీ అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని రైల్వే పోలీస్ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. అతనిని అరెస్ట్ చేయడంలో ఎస్సైలు పి.రమేష్, వెంకటాద్రి, సీబీటీ ఎస్సై భాషా, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తోన్న రైల్వే సీఐ గంగా వెంకటేశ్వర్లు, ముందు నిందితుడు

డాక్టర్ కోడెల శివప్రసాద్‌కు ఘన నివాళి

రాజుపాలెం,మే2: మండలంలోని పలు గ్రామాలలో నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో డాక్టర్ కోడెల చిత్రపటానికి టీడీపీ నేతలు ఘన నివాళులర్పించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు కేక్‌ను కట్‌చేసి పలువురికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నేత డాక్టర్ కోడెల అని కొనియాడారు.

జాతీయ పోటీల్లో రేష్మికి బంగారు పతకం


బంగారు పతకంతో రేష్మి

గుంటూరు(తూర్పు), మే 2 : బెంగుళూరులో జరిగిన ఇండియన్ గ్రాండ్‌పిక్స్-జాతీయ అథ్లెటిక్ పోటీ ల్లో మహిళల జావలిన్ త్రో విభాగంలో గుంటూరుకు చెందిన కే.రేష్మి బంగారు పతాకం కైవసం చేసుకున్నారు. పోటీలలో 53.77 మీటర్లు దూరం విసిరి ఆమె ఈ ఘనతను సాధించారు. గత ఏడాది గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో కూడా రేష్మి కాంస్య పతకం సాధించారు. ప్రస్తుతం ఆమె సౌత్‌సెంట్రల్ రైల్వే టిక్కెట్ కలెక్టర్‌గా విధులు నిర్వహి స్తున్నారు. ఈ సందర్భంగా బంగా రు పతకం సాధించిన కే.రేష్మిని ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా చైర్మన్ జి.శేషయ్య, సంఘ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, సభ్యులు అంకాల సుబ్బారావు, పారిశ్రామికవేత్త టి.అరుణ్‌కుమార్, కాశయ్యతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

ఇండియా కూటమితో రాష్ట్రాభివృద్ధి

● ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), మే 2 : ఇండియా కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని గుంటూరు పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా గురువారం కూటమి నాయకులతో కలిసి నగరంలోని ఆలీనగర్, ఆనంద్‌పేటలలో పర్యటించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి అభివృద్ధికి ఇండియా కూటమి కట్టుబడి ఉందన్నారు. గెలుపునకు నియోజక ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, అకిటి అరుణ్‌కుమార్, నాసర్‌జీ, మంగా శ్రీనివాస్, జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, అప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఘన సత్కారం

గుంటూరు(తూర్పు), మే 2 : స్థానిక భారత్‌పేటలోని సేవా సదన్ కార్యాల యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపికుమార్ ఆధ్వర్యంలో పలు రంగాల్లో సేవలందిస్తున్న కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, భారతి సంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు కావూరి సత్యనారాయణ హాజరై స్టాఫ్ నర్స్ వై.సూర్యకుమారి, ప్రముఖ గాయని చింతా రజిని, ల్యాబ్ టెక్నీషియన్ బెలగొబ్బల శ్రీనివాసరావు, ప్రముఖ గాయకుడు, కార్పెంటర్ మేస్త్రి శెట్టి సాంబయ్య, ఆటో కార్మికుడు లక్ష్మణ్‌నాయక్‌లను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కే.బాబురావు, దేశినేని శ్రీను బాబు, చుండూరు నరసింహారావు, సిరిగిరి సాంబశివరావు, బోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కార్మికులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గరిగంటి

గుంటూరు, మే 2 : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గరిగంటి వెంకటేశ్వర్లు అన్నారు. మిర్చి యార్డు ముఠా కార్మిక సంఘం నేత గరిగంటి వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు వెంకటేశ్వర్లు జిన్నాటవర్ సెంటర్‌లో గురువారం పలువురు యాచకులు, పేదలకు ఆహార పొట్లాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తోటి వారికి సేవలందించే తత్పరను నేటితరం యువత అలవరుచుకోవాలన్నారు. తన తండ్రి వెంకయ్య పేరుతో ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్ర, శ్రీను పలువురు మిర్చి వ్యాపారులు, గరిగంటి కుటుంబ సభ్యులు ఉన్నారు.


యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నేటి నుంచి హోమ్ ఓటింగ్

● రహస్య ఓటింగ్ విధానంలో చేపట్టాలి

● అధికారులను ఆదేశించిన కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మే 2 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే హోం ఓటింగ్‌ని రహస్య ఓటింగ్ విధానంలో చేపట్టాలని, హోం ఓటింగ్ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజంట్లు కూడా ఉంటారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్‌పై ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాల సభ్యులకు, బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్, ఆర్వో మాట్లాడుతూ హోం ఓటింగ్ సమయంలో పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ రికార్డు చేయబడుతుందని, పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజంట్లు కూడా ఉండవచ్చని తెలిపారు. కాని ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరగాలని, ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్ట్మెంట్ ఏర్పాటు చేస్తామని అన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. తూర్పు నియోజకవర్గంలోని హోమ ఓటింగ్ కోసం 5 బృందాలను ఏర్పాటు చేశామని, అయా బృందాల పర్యవేక్షణకు ఏఆర్‌ఓ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ల టీంలను కూడా నియమించామని తెలిపారు. సమావేశంలో ఏఆర్‌ఓలు భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సిఎంఓ హెచ్ డాక్టర్ ఆశా, మేనేజర్ ఎస్ఎన్ ప్రసాద్, సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంల రాండమైజేషన్ స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

గుంటూరు(కార్పొరేషన్), మే 2 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల ర్యాండమైజేషన్ మేరకు ఈవీఎంలను కమిషనింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. గురువారం స్థానిక ఏసీ కాలేజిలో జరగనున్న ఈవీఎంల కమిషనింగ్ ఏర్పాట్లపై తూర్పు నియోజకవర్గంలోని పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎలక్షన్ ఏజంట్ల సమక్షంలో, అధికారులతో కలిసి తూర్పు నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ని ఓపెన్ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్వో మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల వారిగా ఈవిఎంల ర్యాండమైజేషన్ పూర్తి అయిందని, ఏసీ కాలేజిలోని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లోని ఈవిఎంల కమిషనింగ్ ఈనెల 3వ తేదీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గురువారం తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎలక్షన్ ఏజంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ని ఓపెన్ చేయడం జరిగిందన్నారు. అనంతరం ఈవీఎంల కమిషనింగ్ చేసే హాల్‌ని పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. సెక్యూరిటి సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం భద్రత ఉండాలని, రిటర్నింగ్ అధికారి అధీకృత గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లోకి రానివ్వాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఏఆర్‌ఓ, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ మురళి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు(విద్య), మే 2: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు మొత్తం 37 మంది హాజరుకాగా తుది ఎంపికలో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె అపర్ణసీతారామ్, కామర్స్ హెచ్‌వోడీ బి.సుధాకరరెడ్డి, జేకేసీ మెంటార్ యూనిస్‌ఖాన్ తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ జ్యోత్స్నకుమారి తదితరులు

నెహ్రూనగర్ ఆరోలైన్‌లో గంజాయి ముఠా స్వైరవిహారం

గుంటూరు, మే 2 : స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ ఆరో లైన్ వద్ద గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గురువారం సాయంత్రం నలోమీ అనే వృద్ధురాలు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన యువకులు ఢీకొట్టారు. ఈ ఘటనలో వృద్ధురాలి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే యువకులు ద్విచక్ర వాహనం ఆపకుండా వెళ్లేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకున్నారు. స్థానికులు అతి వేగంగా ఎందుకు వెళ్తున్నారు అంటూ ప్రశ్నించారు. వాహనం వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన వారిని స్థానికులు మందలించి చేయి చేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆయా వ్యక్తులు తమ వారిని తీసుకువచ్చి దొరికిన వారిని దొరికినట్టు కొట్టారు. ఈ ఘటనలో చెన్నేపల్లి శ్రీనుకు గాయాలు కాగ ఆయనను జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారులో రెండు లక్షల నగదు సీజ్

గుంటూరు, మే 2 : ఎటువంటి పత్రాలు లేకుండా వెళ్తున్న కారు నుంచి పోలీసులు రూ.2 లక్షల నగదు సీజ్ చేశారు. అమరావతికి చెందిన సూర్యదేవర శ్రీకృష్ణ అనే వ్యక్తి తన కారులో రూ.2 లక్షల నగదుతో వెళుతుండగా విద్యానగర్ మెయిన్ రోడ్డు ఒకటో లైన్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడింది. దీంతో ఎన్నికల అధికారులు ఆ మొత్తం సీజ్ చేసి ట్రెజరీ కార్యాలయానికి పంపారు. శ్రీకృష్ణను విచారించగా తన స్నేహితుని వద్ద నుంచి తీసుకొని వెళుతున్నట్లు చెప్పాడు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
10
గుంటూరు జిల్లా వార్తలు
శుక్రవారం 3 మే 2024

4న రేపల్లెకు పవన్ కల్యాణ్

రేపల్లె, మే 2: జనసేన అధినేత కొణిదల పవన్‌కల్యాణ్ 4వతేదీ మధ్యాహ్నం 12గంటలకు రేపల్లె రానున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉప్పూడి రోడ్డులోని హెలిప్యాడ్ వద్ద దిగి ర్యాలీగా లక్ష్మీటాకీస్ రోడ్డులోని నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించనున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ, బీజేపీ, నాయకులు, కాకర్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని అనగాని కోరారు.

ప్రచారం.. ముమ్మరం

కీలకమైన నామినేషన్ల ఘట్టంతోపాటు ఉపసంహరణల పర్వం కూడా ముగిసి బరిలో ఉండే అభ్యర్థులపై స్పష్టత కూడా రావడంతో ఇక అభ్యర్థులు ప్రచారంపై పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీల తరపున బరిలోఉండే అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్నారు. ఇంకా తొమ్మిది రోజులు మాత్రమే సమయం ఉండడంతో మండుటెండను సైతం లెక్కచేయక ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు పోటీపడుతున్నారు.

- ఇక మిగిలింది తొమ్మిది రోజులే..
- మేనిఫెస్టో హామీలతో పాటు స్థానిక అంశాలపైనే ప్రధానపార్టీల దృష్టి
- ఐదేళ్లలో జరిగిన విధ్వంసంపైనే కూటమి ఫోకస్
- మండుటెండలో చెమటలు కక్కుతూ నేతల ప్రచార హోరు
- వార్డులవారీగా కూడికలు, తీసివేతలతో పరిశీలకుల బిజీ
- జిల్లాలకు ముఖ్యనేతల తాకిడి

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ మేనిఫెస్టో ప్రకటించడంతో ప్రచారంలో వాటిని అస్త్రాలుగా చేసుకుని ముందుకువెళుతున్నారు. కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉండడంతో అభ్యర్థులు ప్రచారంలో మరింత ఉత్సాహంతో అడుగులేస్తుండగా, వైసీపీ మాత్రం ఆ విషయంలో డీలా పడింది.వైసీపీ పాలనలోని ఐదేళ్లలో జరిగిన విధ్వంసంపైనే టీడీపీ నేతలు ప్రధానంగా ఫోకస్ పెట్టి ప్రచారాన్ని సాగిస్తున్నారు. మరోవైపు ట్రెండ్ కూటమి వైపు ఉందనే సంకేతాలు ఉండడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. వారిని ఆపడానికి వైసీపీ తంటాలు చెప్పనలవి కాకుండా ఉంది. మరోవైపు పగలు ప్రచారం, రాత్రివేళల్లో మంతనాలు, వార్డుల వారీగా రివ్యూలతో పార్టీ కాంర్యాలయాలు, నేతల ఇళ్ల జాతరను తలపిస్తున్నాయి. మధ్యమధ్యలో ప్రధానపార్టీల తరపున రాష్ట్రస్థాయి నేతలు వచ్చి వెళుతుండడంతో ఆయాపార్టీల శ్రేణుల్లో గెలుపు ధీమా మరింత పెరుగుతోంది.

కూటమి అధికారంలోకి వస్తే...

ఏళ్లుగా పరిష్కారం లభించని అనేక సమస్యలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గాడిన పెడతామనే హామీని నేతలు ఇస్తున్నారు. మొన్నటి వరకు పార్టీ అభ్యర్థి మాత్రమే ప్రచారం చేసేవారు. ఇప్పుడు సమయం దగ్గర పడుతుండడంతో కుటుంబసభ్యులతో పాటు పా ర్టీలోని ద్వితీయశ్రేణి నేతాగణానికి కూడా వార్డుల వారీ ప్రచార బాధ్యతలను అప్పగించారు. ప్రచారంలో ఇప్పటివరకు టచ్ చేయని ప్రాంతాలపై దృష్టిపెట్టడంతో పాటు, ప్రతికూలత ఉన్న ఏరియాల్లోనే ఇకమీదట ఎక్కువగా ప్రచారం చేయాలనే అంచనాకు నేతలు వచ్చారు. పార్టీ తరపున నియోజకవర్గాల్లో ఉన్న పరిశీలకుల సూచనలు, సలహాలు కూడా పాటిస్తూ అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచారు.

సోషల్ మీడియాపైనా దృష్టి...

ఇక ఉన్న సమయం తక్కువగా ఉండడంతో కోడ్ నిబంధనల మేరకు సోషల్ మీడియాలో ప్రచారంపై కూడా నేతలు దృష్టిసారించారు. వారి ఖాతాలను నిర్వహించడానికి ప్రత్యేకంగా ఓ టీంను ఏర్పాటు చేసుకున్న నేతలూ ఉన్నారు. సోషల్‌మీడియాలో ఎక్కువగా యువతను ఆకట్టుకునే అంశాలపై దృష్టిసారించారు. కూటమి మేనిఫెస్టోలో కీలకమయిన ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి వంటి వాటిపై కూటమి అభ్యర్థులు దృష్టిసారించారు. ఇవే కాకుండా చంద్రబాబుకు ఉన్న ఐటీ బ్రాండ్‌ను కూడా అభ్యర్థులు యువతను లక్ష్యంగా చేసుకుని గుర్తు చేస్తూ వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తూ ప్రచారం చేస్తున్నారు.

విధ్వంసం, అరాచకాలను గుర్తు చేస్తూ...

ఐదేళ్ల పాలనలో అధికారపార్టీ చేసిన విధ్వంసంతో పాటు అరాచకాలను గుర్తు చేస్తూ కూటమి అభ్యర్థులు ప్రచారం సాగిస్తుండగా అరకొరగా అమలు చేసిన సంక్షేమ పథకాలనే నమ్ముకుని వైసీపీ అభ్యర్థులు ఓటర్ల ముందుకువెళుతున్నారు. గతంలో సామాన్య జనంతో పాటు వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలను ప్రజల్లో మరోమారు చర్చకు పెడుతూ కూటమి అధికార ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు.

ముఖ్యనేతల తాకిడి...

ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ జిల్లాలకు ప్రచారానికి వచ్చే రాష్ట్ర స్థాయి నేతల తాకిడి ఎక్కువైంది. ఇటీవలే సీఎం జగన్మోహనరెడ్డి గుంటూరు జిల్లా పొన్నూరులో పర్యటించగా, తెనాలిలో పవన్‌కల్యాణ్, గుంటూరు, చీరాలలో చంద్రబాబు ప్రజాగళం సభలు బుధవారం జరిగిన సంగతి తెలిసిందే. రేపు రేపల్లెలో కూటమి అభ్యర్థికి మద్దతుగా పవన్‌కల్యాణ్ పర్యటన కాగా 7న పొన్నూరులో పవన్ ప్రచారం చేయనున్నారని సమాచారం. సీఎం జగన్మోహనరెడ్డి ఈనెల 6 వతేదీని రేపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించనుండగా, వెంటనే చీరాలలో కూడా సీఎం జగన్ ప్రచారం చేయనున్నారని తెలుస్తోంది.



కూడికలు, తీసివేతలతో బిజీబిజీ...

అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉంటే పార్టీలు నియో జకవర్గాల వారీగా నియమించిన పరిశీలకులు వార్డుల వారీ బలాబలాలతో పాటు కూడికలు తీసివేతలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రతి రోజూ ఆ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై అధిష్టానానికి నివేదిక ఇవ్వాల్సిన పరిశీలకులపై ఉండడంతో వారూ అభ్యర్థులతో సమానంగా పనిచేస్తూ వారి గెలుపు కోసం తెరవెనక వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమయి ఉన్నారు.

రెండుపూటల ప్రచారం...

పోలింగ్‌తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులు రెండు పూటల ప్రచారం చేస్తున్నారు. ఉదయం వేళ టిఫిన్ విత్ లీడర్ అంటూ అటు ప్రచారం ఇటు ప్రజలతో మమేకం అవుతున్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయాన్నే ప్రచారం మొదలెట్టి పదకొండుగంటల సమయానికి ఓ దశ ముగించి మళ్లీ సాయంత్రం మొదలెట్టి పది గంటల వరకు తిరుగుతున్నారు. మరోవైపు ప్రచారంలో అవలంబించే వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు



కాంగ్రెస్‌తోనే హోదా.. అభివృద్ధి

- మహిళలకు ఏడాదికి రూ.లక్ష పథకం
- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్యం ఠాగూర్

గుంటూరు, మే 2: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని, గుంటూరు అభివృద్ధి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే, తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. లాలాపేటలో రోడ్‌షో నిర్వహించిన ఆయన పూల మార్కెట్ సెంటర్‌లో ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీఎస్టీలో శ్లాబులు మార్చి ప్రజలకు ఊరట కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఏటా లక్ష రూపాయలను నేరుగా లబ్ధిదారులకు ఖాతాల్లో వేస్తామని తెలిపారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలతో ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మార్పు సాధ్యమవుతుందన్నారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప పదేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. నగరాభివృద్ధిపై ఏ చర్చకైనా సిద్ధమేనని సవాల్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నూనె పవన్‌తేజ, కట్టా జవహర్‌బాబు, పలగాని రామకృష్ణ, అంబటి రత్తయ్య తదితరులున్నారు.


లాలాపేటలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్, మస్తాన్‌వలి తదితరులు


రోడ్ షోలో ప్రసంగిస్తున్న మాణిక్యం ఠాగూర్ పక్కన మస్తాన్‌వలి, లింగంశెట్టి తదితరులు


రోడ్ షోకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

వైసీపీని ఓడించడమే బీసీల లక్ష్యం

- ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

మంగళగిరి, మే 2: బీసీలను అన్ని రకాలుగా అణగదొక్కిన వైసీపీ ప్రభుత్వా న్ని ఓడించడమే బీసీల లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో గురువారం బీసీ సామాజికవర్గ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. మంగళగిరిలో నారా లోకేశ్ గెలుపు కోసం బీసీలు అవలంబించాల్సిన పలు అంశాలపై చర్చిం చారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్యతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీల కోసం అమలు చేసిన 34 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 25 శాతానికి తగ్గించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. బీసీలకు మొక్కుబడిగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నామమాత్రపు నిధులు కూడా ఇవ్వకుండా బీసీ లను దారుణంగా వంచించారని పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నుంచి సుమారు రూ.34 వేల కోట్ల నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. జగన్ హయాంలో అత్యధికంగా నష్టపోయింది బీసీలేనని చెప్పారు. టీడీపీ హయాంలో బీసీలకు స్వయం ఉపాధికి రుణాలు, చేతి వృత్తుల వారికి ఆదరణ పథకం కింద 90 శాతం రాయితీపై వృత్తి పరమైన పరికరాలు అందించారని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీల్లో చేర్చాలని చంద్రబాబు ప్రతి పాదనలు కూడా సిద్ధం చేశారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలకు బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందన్నారు. మంగళగిరిలో బీసీలంతా ఐక్యంగా పనిచేసి నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు గుర్రపుశాల రామకృష్ణ, కృష్ణ బలిజ, పూసల సాధికార సమితి కన్వీనరు వేణుగోపాల్, కావేటి యల మందరావు, దావులూరి శ్రీనివాసరావు, వల్లభాపురపు శంకర్, నూతక్కి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

పోస్టల్ బ్యాలెట్‌పై అస్పష్టత

- ఈసీ ఉత్తర్వులు ఇచ్చినా తొలగని అపోహలు
- ఫారం-12డీలపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ



గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ కోసం ఓపీవోలు, ఇతర సిబ్బంది తమ ఫారం-12డీలను ఏ మండల ఏఆర్‌వోకు ఇవ్వాలో ఇప్పటికే ఎన్నికల సంఘం స్పష్టంగా పేర్కొన్నది. ఉద్యోగి పనిచేస్తున్న నియోజకవర్గంలోని ఏఆర్‌వోకే ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా కొంత మందిలో అపోహలు తొలగిపోలేదు. నేటికీ తమ ఓటు ఫలానా నియోజకవర్గంలో ఉంది, తాము ఇక్కడ పనిచేస్తున్నాం. ఎక్కడ ఓటు వేయాలి అంటూ ఇంకా అస్పష్టతతో ఉన్నారు. కాగా గత నెల 20నే ఈసీ ఈ విషయంలో అనుమానాలు తొలగిస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈసీ జారీ చేసిన నిబంధనల ప్రకారం ఉద్యోగి ఎక్కడైతే పని చేస్తున్నాడో తన ఓటు వేరే నియోజకవర్గం/జిల్లాలో ఉన్నా ఫారం-12డీని మాత్రం పని ప్రదేశంలోని నియోజకవర్గ కేంద్రంలో ఉండే ఏఆర్‌వోకే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. ఏఆర్‌వోలు తమ వద్దకు వచ్చిన ఫారం-12డీలను ఏ రోజుకు ఆ రోజు ఆర్‌వోలకు పంపాలి. వాటిల్లో సొంత నియోజకవర్గానివి ఆర్‌వోల వద్దనే ఉంచుకుని ఇతర నియోజకవర్గాలు/జిల్లాలవి జిల్లా ఎన్నికల అధికారికి పంపాలి. జిల్లాలోనే వేరే నియోజకవర్గంలో ఉద్యోగి ఓటు ఉంటే అక్కడి ఆర్‌వోకి సంబంధిత ఫారం-12డీలను జిల్లా ఎన్నికల అధికారి పంపించాలి. అదే వేరే జిల్లాలకు చెందిన వారి ఫారంలను ఓటరు ఐడీతో జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత డీఈవోకు పంపించాలి. ఇందుకోసం ఎన్నికల సంఘం గత నెల 28నే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీ సచివాలయం వెలగపూడిలో ఏ జిల్లాకు ఆ జిల్లా ఫారంలను ఎక్స్ఛేంజ్ చేసుకునేందుకు ఫస్టు సెంట్రల్ ఎక్స్ఛేంజ్ పేరుతో కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. ఆ రోజున అన్ని జిల్లాల డీఈవోలు తమ సిబ్బందిని అక్కడికి పంపారు. ఇలా వచ్చిన ఫారాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్లను సంబంధిత ఆర్‌వోల వద్ద నుంచి తెప్పించి మే 3న జరిగే సెకండ్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ రోజున వాటిని అందజేస్తారు. ఇలా పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారు ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ని పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు మే 5న, ఓపీవోలకు మే 6న, పోలీసు సిబ్బంది, ఏవీఈఎస్, ప్రైవేటు వ్యక్తులకు మే 7న, ఇతర జిల్లా ఓటర్లకు మే 8న నిర్వహిస్తారు. పోలింగ్ అయిన పోస్టల్ బ్యాలెట్‌లు, వినియోగించని వాటిని అనెక్చూర్-6లో పేర్కొంటూ మే 10న వెలగపూడి సచివాలయంలో నిర్వహించే థర్డ్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్‌లో అంద జేయాలి.

కోడ్ ఉల్లంఘనలపై కేసులు


- మద్యం సరఫరాపై నిఘా పెట్టాలి
- అధికారులకు ఎన్నికల పరిశీలకుల ఆదేశాలు

గుంటూరు సిటీ, మే 2: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించి కేసులు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, వేణుగోపాల్‌రెడ్డి, తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, ఈస్ట్ అసెంబ్లీల ఎన్నికల పరిశీలకులు కార్తీకా, మంగళగిరి, పొన్నూరు, తెనాలి ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్, గుంటూరు లోక్‌సభ పోలీస్ పరిశీలకులు సత్యరత్ అనురుథ్ పంకజ్, ఎస్పీ తుషార్ డూడీతో కలసి సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షణకు నియమించిన నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు, పర్యవేక్షణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ అనధికార మద్యం రవాణాను అరికట్టేందుకు నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ రోజున ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా కల్పిస్తున్న సౌకర్యాలపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ తో పాటు, హోం ఓటింగ్‌పై సంబంధిత సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ అందించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు స్పెక్ట్రమ్ యాప్‌పై అవగాహన కల్పించా లన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, నోడల్ అధికారులు శైలజ, హరిహరనాథ్, లక్ష్మి, కరీమ్, రఘు, వీరా వెంకట సత్యనారాయణ, రమణమూర్తి, వీరాచారి, శివరామకృష్ణ, శ్యాంసుందర్, గాలిదేముడు, శేషశ్రీ, రవీంద్రబాబు, నాగశేషు, మహబూబ్ బాషా, సీహెచ్ సువార్త తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు

నా ఎన్నికల ఖర్చు.. పదివేలే

- ఇందిరాగాంధీయే స్వయంగా వచ్చి నాకు బీ ఫాం ఇచ్చారు
- చంద్రబాబు, వైఎస్, నేనూ ఒకేసారి అసెంబ్లీలో అడుగుపెట్టాం
- నిజాయితీ, అభివృద్ధి చేసే వారినే ఎన్నుకోవాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు



గుంటూరు, మే2: టీడీపీ అధినేత చంద్రబాబు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిలతో సమకాలికులైన గుంటూరు నగరానికి చెందిన లింగంశెట్టి ఈశ్వరరావు ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా 1978లో గుంటూరు-1 (ప్రస్తుతం గుంటూరు తూర్పు) నుంచి పోటీచేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆయనతో పాటు మాజీ సీఎం చంద్రబాబు, దివంగత సీఎం వైఎస్ఆర్‌లు ఒకేసారి అసెంబ్లీకి వెళ్ళారు. అప్పట్లో లింగంశెట్టికి ఎన్నికల కోసం అయిన ఖర్చు అక్షరాల రూ.10వేలకు కూడా మించలేదు. అదీ ఆయన మామ సొంత ఖర్చులు వెచ్చించి ఎన్నికలు చేశారు. అప్పట్లో ఎవరికి వారు అభిమానులు, కార్యకర్తలు ఖర్చులు పెట్టుకునేవారు. ప్రస్తుతం ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని చూసిన లింగంశెట్టి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నాటి - నేటి పరిస్థితులపై మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే....

- అప్పట్లో నేను ఇందిరా నవసమాజ్ నిర్మాణ సమితి సంస్థ పేరుతో విస్తృతమైన సేవలందించాం. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తించిన ఇందిరాగాంధీయే అప్పట్లో స్వయంగా గుంటూరు వచ్చి 1978 ఎన్నికలకు నాకు గుంటూరు -1 అభ్యర్థిగా పోటీ చేసేందుకు బీ ఫాం అందజేయటం మరిచిపోలేనది. అప్పట్లో రాజకీయ ఉద్దండులైన ఆచార్య ఎన్‌జీ రంగా, పీవీ నరసింహరావు, పీ రాజారామ్‌లు వచ్చి నా తరపున ప్రచారం చేశారు. నా వద్ద డబ్బు లేకపోతే మా మామ చింతా వెంకటరత్నం ఎన్నికల ఖర్చు సమకూర్చారు. మొత్తంగా రూ.10వేలకు కూడా మించలేదు. ఆ ఎన్నికల్లో విజయం సాధించా.
- 1978లో చంద్ర బాబు, నేనూ ఇందిరా కాంగ్రెస్ నుంచి గెలుపొందితే వైఎస్ రాజశేఖరరెడ్డి రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆ తరువాత నేను భవనం వెంకటరామిరెడ్డి వైఎస్ఆర్‌తో మాట్లాడి రెడ్డి కాంగ్రెస్ నుంచి ఇందిరా కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చాం. ఆ తరువాత భవనం వెంకటరామిరెడ్డి కేబినెట్‌లో చంద్రబాబు, వైఎస్ఆర్‌లు మంత్రులుగా పనిచేశారు. ఆ తరువాత నేను ప్రభుత్వ విప్‌గా వ్యవహరించా. గుంటూరులో 20వేల కుటుంబాలకు ఇళ్ళ స్థలాల పట్టాలిచ్చాం. నాగార్జున యూనివర్శిటీ పాలకవర్గ మెంబర్‌గా దూర విద్యా కేంద్రాన్ని తీసుకొచ్చాం.
- అప్పట్లో ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం పెరగటం, ధన ప్రవాహం ఎక్కువవటంతో రాజకీయాలు ఖరీదయ్యాయి. సామాన్యుడు రాజకీయాల్లోకి రాకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు.
- నిజాయితీ వ్యక్తిత్వం, అభివృద్ధి చేసే నాయకుడితో పాటు ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండే నాయకుడిని ప్రజలు ఎన్నుకోవాలి. గుంటూరు జిల్లా ప్రజలు విజ్ఞులు, నాటి నుంచి నేటి వరకు డబ్బు లేని వారిని గెలిపించారు... డబ్బులున్న వారినీ గెలిపించారు. ఎప్పటికప్పుడు పనిచేయని నాయకుడికి జిల్లా ప్రజలు తమ ఓటు పవర్ ఏంటో చూపించారు కూడా.

Format C-1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India &Anr.)

Name and address of candidate : **Lokesh Nara, S/o. Chandrababu Naidu Nara, R/o. D.No.3-781/1, Karakatta, Undavalli, Tadepalli Mandal, Guntur District.**

Name of political party : **Telugu Desam Party**
(Independent candidates should write "Independent" here)

Name of Election : **A.P. Legislative Assembly - 2024**

*Name of Constituency : **87- Mangalagiri Assembly Constituency**

I, LOKESH NARA, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases

Sl. No	NAME OF COURT	CASE NO. AND DATED	STATUS OF CASE(S)	SECTION(S) OF ACTS CONCERNED AND BRIEF DESCRIPTION OF OFFENCE(S)
1	NOT APPLICABLE	F.I.R. No.193/2023 dated 01.09.2023 of Nallajerla P.S.	Under Investigation	Sections 341, 427, 506, 109 r/w Section 34 of Indian Penal Code, 1860. Dishonest intention to create disturbances between two parties.
2	NOT APPLICABLE	F.I.R. No.32/2023 dated 23.02.2023 of Gajula Mandyam P.S.	Under Investigation	Sections 143, 353, 506, 188 r/w Section 149 of Indian Penal Code, 1860. Addressing speech to the gathered public by obstructing public official from performing legitimate duties and threatening with dire consequences.
3	NOT APPLICABLE	F.I.R. No.20/2023 dated 04.02.2023 of Palamaner P.S.	Under Investigation	Sections 341, 188, 290 r/w Section 34 of Indian Penal Code, 1860. Conducting public meeting without permission by using mike, sound system standing atop eicher vehicle on National Highway blocking entire road and movement of general public and free flow of traffic.
4	NOT APPLICABLE	F.I.R No.16/2023 dated 03.02.2023 of Bangarupalem Urban P.S.	Under Investigation	Sections 353, 290, 188, 341 r/w Section 34 of Indian Penal Code, 1860. Roaming in campaigning vehicles by keeping mike and loud speakers without having prior permission, causing annoyance and inconvenience to the general public by disobeying the orders of a public servant.
5	NOT APPLICABLE	F.I.R. No.16/2023 dated 11.02.2023 of S.R. Puram P.S.	Under Investigation	Sections 188, 341, 290 r/w Section 34 of Indian Penal Code, 1860. Conducting meeting without permission; violating orders of superior officers; causing obstruction to free flow of traffic and disturbing public peace.
6	NOT APPLICABLE	F.I.R. No.7/2023 dated 08.02.2023 of Narasingarayanipet P.S.	Case is PT	Sections 188, 341, 290 r/w Section 34 of India Penal Code, 1860. Conducting meeting without permission; violating orders of superior officers; causing obstruction to free flow of traffic and disturbing public peace.
7	NOT APPLICABLE	F.I.R. No.162/2022 dated 28.08.2022 of Amadalavalasa P.S.	Preventive arrest.	Section 151 of Code of Criminal Procedure, 1973 Preventive Arrest to avoid law and order problem in land disputes in Ullasapeta Village, Palasa Mandal.
8	NOT APPLICABLE	F.I.R. No.161/2022 dated 28.08.2022 of Amadalavalasa P.S.	The case is under investigation for examination of some more witnesses.	Sections 341, 188 r/w Section 34 of Indian Penal Code, 1860 Supported people in Ullasapeta Village, Palasa Mandal and involved in disputes and created law and order problem.
9	NOT APPLICABLE	F.I.R. No.75/2022, dated 17.04.2022 of Kalyanadurgam P.S.	Under Investigation	Section 153a r/w Section 34 of Indian Penal Code, 1860. Social media post in Twitter regarding the death of a girl child during the road show held by Minister for Women & Child Welfare Smt.K.V.Ushasri Charan and provoked public.
10	Hon'ble Court of the Special Judge for SPE & ACB Cases -cum-Additional Metropolitan SessionsJudge, Vijayawada	F.I.R. No.16/2022, dated 09.05.2022 of CID Police Station, A.P., Amaravathi, Mangalagiri	Chargesheet filed on 08.02.2024.	Sections 120(B), 420, 34, 35, 36, 37, 166, 167 and 217 of Indian Penal Code, 1860 and Section 13(2) r/w Section 13(1)(a) of Prevention of Corruption Act, 1988 . Conspiracy while designing the Master Plan for the AP Capital region and the capital city and the alignment of the Inner Ring Road and its connected arterial roads to cause wrongful gain to certain persons.
11	NOT APPLICABLE	F.I.R. No.665/2021, dated 09.09.2021 of Krishna Lanka P.S.	Under Investigation	Section 341, 186, 269 r/w. 34 of Indian Penal Code, 1860. Blocking National Highway at Varadhi Junction resulting in traffic congestion on the National Highway.
12	NOT APPLICABLE	F.I.R. No.651/2021, dated 20.10.2021 Mangalagiri Rural P.S.	Under Investigation	Sections 147, 148, 307, 332, 427, 323, 324, 342, r/w Section 149 of Indian Penal Code, 1860; Section 3(1)(r), 3(1)(s) of SC & ST Prevention of Atrocities Act, 1989. Caught hold of the complainant and questioned about the identity of the complainant.
13	NOT APPLICABLE	F.I.R. No.448/2021, dated 16.08.2021 of Old Guntur P.S.	Under Investigation	Sections 341, 353, 147 r/w Section 149, 120(B) of Indian Penal Code, 1860. Several persons belonging to Telugu Desam Party formed into unlawful assembly, standing on the road and obstructed free flow of traffic, gave slogans against Andhra Pradesh Government, resisted and obstructed duties of police.
14	NOT APPLICABLE	F.I.R. No.447/2021, dated 16.08.2021 of Old Guntur P.S.	Preventive Arrest (Closed)	Section 151 of the Code of Criminal Procedure, 1973. Preventive Arrest to control untoward incidents.
15	NOT APPLICABLE	F.I.R. No.111/2021, dated 30.04.2021 of D.Hirehal P.S.	Under Investigation	Sections 153(A), 505, 506 of Indian Penal Code, 1860. Tweet on social media platform twitter pointing out the failure of Rayadurgam MLA Kapu Ramachandra Reddy.
16	NOT APPLICABLE	F.I.R. No.511/2020, dated 30.05.2020, Nandigama P.S.	The involvement of A2 i.e., Nara Lokesh has not been established during investigation	Sections 188, 270 of Indian Penal Code, 1860 and Section 3 of Epidemic Diseases Act, 1897. Violated Covid-19 guidelines by not maintaining social /physical distance and shouting slogans.
17	NOT APPLICABLE	F.I.R. No.236/2020, dated 26.10.2020 of Akividu P.S.	Under Investigation	Section 279 of Indian Penal Code, 1860; Section 184 Motor Vehicle Act, 1988; Section 51(a) of Disaster Management Act, 2005 and Section 3 of Epidemic Diseases Act, 1897. Driving tractor in contravention to the provisions of Motor Vehicle Act, 1988 and without following social distancing norms issued during Covid-19 period.
18	I Additional Junior Civil Judge -cum-I Additional Metropolitan Magistrate, Vijayawada	C.C.No.1658/2021	Quashedvide Judgment dated 02.12.2022 in Crl.P.No.9552 of 2022.	Section 188 r/w Section 34 of Indian Penal Code, 1860 and Section 3 of Epidemic Diseases Act, 1897. Gathering and holding press meet in an area during Covid-19 period where public gatherings were prohibited.
19	NOT APPLICABLE	F.I.R.No.23/2020, dated 08.01.2020 of Patamata P.S.	Action Dropped on 08.01.2020	Section 151 of Code of Criminal Procedure, 1973. Preventive Arrest
20	NOT APPLICABLE	F.I.R.No.9/2020, dated 07.01.2020 of Krishna Lanka P.S.	Action Dropped on 07.01.2020	Section 151 of Code of Criminal Procedure, 1973. Preventive arrest to avoid any untoward incident and to prevent from committing any cognizable offence.
21	II ADDITIONAL JUDICIAL FIRST CLASS MAGISTRATE , GUDIVADA.	C.C.No.738 /2019	Name of Sri.Nara Lokesh was deleted after investigation and the case was acquitted on 14.08.2023	Section 153, 505 (2), 120b of Indian Penal Code, 1860. Social Media post by Unknown TDP activists criticizing C.M. Jagan Mohan Reddy and Minister for Water Resource K.Anil Kumar Yadav thereby causing anguish to the YSRCP party activists.

తరువాయి I వ పేజీలో

శ్రావణ్‌కుమార్ ప్రచారాన్ని విజయవంతం చేయాలి

తుళ్లూరు, మే 2 : తాడికొండ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ తుళ్లూరులో శుక్రవారం సాయంత్రం 5గంటలకు ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కార్యకర్తలు, నాయకుల సమావేశం జరిగింది. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు నాయకులు ప్రచారంలో అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. భారీ మెజార్టీతో కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించుకోవాలన్నారు. సమావేశానికి మూడు పార్టీల కార్యకర్తలు ముఖ్యనాయకులు హాజరయ్యారు.

టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ దంపతులు



పార్టీలో చేరిన అనంతరం శ్రావణ్‌కుమార్‌తో ప్రచారంలో పాల్గొన్న జడ్పీటీసీ జ్యోతి దంపతులు

తాడికొండ, మే 2: తాడికొండ వైసీపీ జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి వైసీపీని వీడి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ తరపున జడ్పీటీసీగా గెలిచిన గుడిమెట్ల జ్యోతి తన భర్త వీర్లంకయ్యతో కలిసి తెనాలి శ్రావణ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు వైసీపీని వదిలిపెట్టారంటే అక్కడ వారికి సరియైన గౌరవ మర్యాద దక్కడం లేదన్నారు. లాం గ్రామంలోని మైనార్టీలు వైసీపీలో నుంచి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభావంతో వైసీపీ తుడిచి పెట్టుకుపోతుందన్నారు. పార్టీ అధికారంలోకి రావటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వారం రోజులు కష్టపడి పనిచేస్తే రాష్ట్రాభివృద్ధికి దోహపడుతారన్నారు.

తాడికొండలో టీడీపీ ఎన్నికల ప్రచారం



తాడికొండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

తాడికొండ, మే 2: తాడికొండ గ్రామంలో టీడీపీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా గురువారం ప్రారంభించారు. టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టో అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయన్నారు. టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉన్నదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ మేదర సాధికార సమితి కన్వీనర్ దూళిపాళ్ల ఏసుబాబు, మాజీ ఉపసర్పంచ్ ఉమ్మనేని రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ గెలుపు కోసం విస్తృత ప్రచారం



సీతానగరంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి టౌన్, మే 2: యువనేత నారా లోకేశ్ గెలుపుతోనే మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అని, ప్రతి పక్షంలో ఉన్నా పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని నాయకులు స్థానికులకు వివరించారు. సీతానగరంలో గురువారం టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇట్టా భాస్కర్, గాడి సాంబశివరావు, అంజలి, హనుమంతు, గాడి ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నాంచారయ్య, మహేష్, బుజ్జి, కృష్ణ, గంగాధర్‌రావు, కోటేశ్వరరావు జయమ్మ, రేవతి, పద్మావతి, సుజాత ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

తాడేపల్లి, మే 2: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారి, సాయిబాబా గుడిపక్కన ఉన్న ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఉదయం కంప్యూటర్ శిక్షణ తరగతులను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రారంభించారు. 45 రోజులపాటు నేర్పించే ఈ శిక్షణ తరగతుల్లో ఎంఎస్ ఆఫీస్, డీటీసీ, టాలీ వంటి కోర్సులు నామమాత్రపు ఫీజు రూ.600లతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు డి.రమాదేవి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9490099201, 9866466306 నెంబర్లలో సంప్రదించాలని అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో అమలాశ్రీ, శ్రీదేవి, కంప్యూటర్ శిక్షణ టీచర్ ఎస్‌కె ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి ఆధ్వర్యంలో రోడ్‌షో

- మంగళగిరిలో పోటీ చేసే అర్హత కమ్యూనిస్టులకే ఉంది
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



రోడ్ షోలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు పక్కన జొన్నా, పాశం రామారావు

తాడేపల్లి టౌన్, మే 2: తాడేపల్లిలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ గురువారం రోడ్‌షో నిర్వహించారు. తాడేపల్లి ఉండవల్లి సెంటర్ నుంచి సీతానగరం వరకు ఈ రోడ్‌షోను నిర్వహించారు. ఈ రోడ్‌షోలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరిలో పోటీ చేసే అర్హత కమ్యూనిస్టులకే ఉందని ఎమ్మెల్యేగా సీపీఎం నేత జొన్నా శివశంకర్‌ను, ఎంపీగా సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. నాలుగు ఇస్త్రీ బళ్లు పంచినంత మాత్రాన లోకేశ్ హీరో కాడని, కుటుంబంలో నలుగురికి సంక్షేమ పథకాలు అందించినంత మాత్రాన ప్రజలు వైసీపీకి ఓట్లు వేయరని, రాజధాని ద్రోహి నరేంద్రమోదీ ఆయనకు మద్దతుగా ఉన్న టీడీపీ, జనసేన, వారితో అంటకాగుతున్న వైసీపీ కూడా ద్రోహులేనని అన్నారు. సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వై నేతాజీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శామ్యూల్, సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, శివరామకృష్ణయ్య శ్రీనివాసకుమారి, సీపీఐ నేతలు తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంగళగిరి, మే 2: మంగళగిరి బస్టాండు సెంటర్లోని ఓ సెల్ ఫోను దుకాణం ఎదుట గురువారం సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సదరు వ్యక్తి ఫూటుగా మద్యం తాగి మండుటెండలో అటు ఇటూ తిరిగినట్టుగా స్థానికులు చెబుతున్నారు. ఎండ వేడిమికి తాళలేక గొంతెండిపోయి మృతి చెందినట్టుగా భావిస్తున్నారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

● తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి



కాజలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన బీజేపీ శ్రేణులు

మంగళగిరి సిటీ, మే 2: వైసీపీ అసమర్థ పాలనతో అంధకారంలోకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరిగి అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు నాయకత్వం చారిత్రక అవసరమని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి అన్నారు. మంగళగిరి మండలం కాజ గ్రామంలోని వెంకటరెడ్డిపాలెంలో గురువారం సాయంత్రం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. కూటమి బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాజ గ్రామ టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, బీజేపీ అధ్యక్షుడు కారుమూరి శ్రీనివాసరెడ్డి, నేతలు నంబూరు రవి, కుక్కమళ్ల స్వామి, శివబాబు, రాఘవరావు, పోతురాజు శ్రీనివాసరావు, రామిరెడ్డి, ఎం.శ్రీకాంత్, సింహాద్రి భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

● ఊపందుకున్న కూటమి శ్రేణుల ప్రచారం



దళితవాడలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

దుగ్గిరాల, మే 2: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి అన్నారు. దుగ్గిరాలలోని దళితవాడలో తెలుగుమహిళలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అంగీకారంతో ప్రకటించిన మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. సంక్షేమానికి ఆద్యుడుగా, పేద, బడుగు, బలహీన వర్గాలకోసం అహర్నిశలు శ్రమించిన ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ హయాంలో జరిగిన సంక్షేమాన్ని, చంద్రబాబు చేసిన అభివృద్ధిని గుర్తుచేస్తూ ప్రచారం కొనసాగించారు. పెరిగిన నిరుద్యోగం, దళితులపై దాడులు, తప్పుడు కేసులు వంటి విషయాలను వారితో మాట్లాడుతూ వారి నుంచి వస్తున్న స్పందనతో, రెట్టించిన ఉత్సాహంతో వీధివీధి తిరుగుతూ ప్రచారం కొనసాగించారు. గద్దె శివకుమారి, గూడూరు ఉషారాణి, పొన్నం విద్యశ్రీ, జంపాల కావ్య, అత్తోట భారతి, పాటిబండ్ల విజయలక్ష్మి, బాణావత్ ఉమాదేవి, గార్లపాటి లక్ష్మి, ఎర్రమాసు సాయిశ్రీ, షేక్ జుబేదా, కొల్లి రజని, తుమ్మపూడి కోటేశ్వరి, జంపాల నాగమణి, సాయిరత్న, జీ కోమలి, బంగారు లక్ష్మి తదితర తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసిన జగన్

● ఇప్పుడు సిగ్గు లేకుండా ఓట్లు ఎలా అడుగుతావు

● నిలదీసిన సమతాసైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి



సమావేశంలో మాట్లాడుతున్న పాలేటి మహేశ్వరరావు

ప్రత్తిపాడు, మే 2: నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీ అంటూ మాట్లాడే జగన్ వారందరికీ తీవ్రంగా అన్యాయం చేశాడని, ఇప్పుడు సిగ్గు లేకుండా ఓట్లు ఎలా అడుతాడంటూ సమతాసైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ పాలేటి మహేశ్వరరావు ప్రశ్నించారు. ప్రత్తిపాడులో భవాని వాస కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1.42 లక్షల మంది విద్యార్థులను రోడ్డున పడేసిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యకు జగన్ పేరు పెట్టుకోవడంతో పాటు ఆయన సామాజిక వర్గం వారికే విదేశాలకు వెళ్లే అవకాశాన్ని కల్పించిన దుర్మార్గుడు జగన్ అన్నారు. ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ఉన్న సుమారు 15 పథకాలను రద్దు చేసి, వారిని ఎదగనీయకుండా చేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న భూమి కొనుగోలు పథకాన్ని పూర్తిగా రద్దు చేశాడని, 1.37 ఎకరాల ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను లాక్కుని జగనన్న కాలనీలు ఏర్పాటు చేశాడని విమర్శించారు. ఈ విషయాలను గుర్తు పెట్టుకుని జగన్‌ను తరిమికొట్టాలని ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీలను కోరారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్రకుమార్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



సీతారాముల పూజల్లో పాల్గొన్న మన్నెం రమేష్, డాక్టర్ సాయిప్రసాద్

మంగళగిరి, మే 2: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గోపాలకృష్ణ థియేటర్ వీధిలో ఉన్న రామాలయంలో గురువారం సాయంత్రం సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ గావించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, అనిత దంపతులు, డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్, గోవాడ రవి, భక్త బృందం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

● నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్



తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన బేతపూడి గ్రామస్థులు

ఫిరంగిపురం, మే 2: జగన్‌ను తరిమికొట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని శాంతిపేట, గరుడాచలపాలెం, తక్కెళ్ళపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. యువతీ యువకులు నిరుద్యోగంతో అల్లాడి పోతూ ఈ ప్రభుత్వాన్ని మార్చాలని రగిలిపోతున్నారని, వ్యాపారులు ప్రభుత్వం పెట్టే ఇబ్బందులు భరించ లేకుండా ఉన్నారని, ఎస్సీ, ఎస్టీలకు పథకాలు రద్దు చేయటంతో ఆగ్రహంతో ఉన్నారని, మైనార్టీలకు రక్షణ లేక కార్మికులకు ఉపాధి లేక ప్రజలు పన్నుల పెనుభారంతో అల్లాడుతూ ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు సాగనంపుదామా? అని ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజల అభిప్రాయాలను వైసీపీ ప్రభుత్వం అణచి వేసిందన్నారు. దీంతో ప్రజలు రాష్ట్రానికి పట్టిన శనిని వదిలించుకోవటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బేతపూడిలో 50 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో శ్రావణ్‌కుమార్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, ఆళ్ళ కృష్ణమూర్తి, ఫరూక్ అహమ్మద్, మాజీ సర్పంచ్ బుజ్జి, కటికల అప్పారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి తదితరులు

కాకుమాను, మే 2: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో మౌళిక వసతుల కల్పిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి అన్నారు. మండలపరిధిలోని బోడిపాలెం, కొతివానిపాలెం, తెలగాయపాలెంలోని ఆరు పోలింగ్ బూత్‌లను గురువారం ఆమె పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో ఫ్యాన్‌లు, లైట్‌లు, అలాగే టాయిలెట్‌ల వంటి వసతులు కల్పించాలని ఆమె అన్నారు. మే 13న జరిగే పోలింగ్ నాడు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటికే ఓటరు స్లిప్పులు ఇంటింటికి వెళ్లి బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మంచాల సుశీల్ రాజా

తుళ్లూరు, మే 2: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంచాల సుశీల్ రాజా శుక్రవారం మండలపరిధిలోని వెంకటపాలెం నుంచి ప్రచారం ప్రారంభిస్తారని ఆ పార్టీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ మేరకు గుంటూరు కార్యాలయంలో నియోజకవర్గ నాలుగు మండలాల కాంగ్రెస్‌పార్టీ నేతలతో మంచాల సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రచార రథాలను ఆయన ప్రారంభించారు. వెంకటపాలెం వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రచారం చేయనున్నారు. తాళ్లాయపాలెం, మందడం, మల్కాపురం, వెలగపూడి ఉద్దండ్రాయునిపాలెం వరకు ప్రచారం సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అమరావతి రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉంటుందని ఇంతకు ముందే స్పష్టం చేసిందన్నారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడన్నారు. రాజశేఖర్‌రెడ్డి అభిమానులందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు వెంకటయ్య, కొమ్మినేని రామాంజనేయులు, చాదరాజుపల్లి చంద్రం, గోపాలకృష్ణ, జయరాజు, మెండెం కోటేశ్వరావు, కొల్లాబాబు, కంచర్ల గాంధీ, రహమాన్, షరీఫ్ పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలి

● నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ పల్లెపోగు రాజారావు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

తుళ్లూరు, మే2: కూటమి బలపరిచిన తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని తాడికొండ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ పల్లెపోగు రాజారావు అన్నారు. గురువారం తుళ్లూరులో కర పత్రాలు ఆవిష్కరించారు మాదిగ జాతి అస్తిత్వాన్ని ఆత్మగౌరవాన్ని ప్రదర్శించే విధంగా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కూటమితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతిలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్పొరేషన్‌లనూ నిర్వీర్యం చేసిందన్నారు. సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.25వేల కోట్లు వేరే పథకాలకు మళ్లించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి నూతక్కి బాలరాజు, ఎంఎస్పీ అధ్యక్షుడు వేల్పుల కిరణ్, చెరుకూరి సన్నీ పత్తిపాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆదాయం రూ.20.88లక్షలు

కాకుమాను, మే 2: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొండపాటూరు పోలేరమ్మవారి తిరునాళ్ల సందర్భంగా రూ.20,88,757 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.సురేష్‌బాబు తెలిపారు. బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్యామల ఆధ్వర్యంలో గురువారం హుండీల లెక్కింపు చేశారు. హుండీల ద్వారా రూ.13,87,887 వచ్చిందని, దర్శనం టికెట్‌ల ద్వారా రూ.3,04,260, చందాల ద్వారా రూ.37,610, లడ్డు ప్రసాదాల ద్వారా రూ.1,20,000 వేలంపాటల ద్వారా రూ.2,39,000 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కంఠంనేని నరేష్‌బాబు, ఎం శ్రీనివాసరావు, అర్చకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బండారుపల్లి రైల్వే గేటు మూసివేత

తాడికొండ, మే 2: బండారుపల్లి రైల్వే లైన్ రిపేర్లు నిమిత్తం రెండు రోజుల పాటు రైల్వే గేటును మూసివేస్తారని తాడికొండ సీఐ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లవరం-బండారుపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే ట్రాక్‌ను రిపేర్లు చేయటం వల్ల 3, 4 తేదీల్లో రైల్వే గేట్ మూసి వేస్తారని అటు వైపు వెళ్లేవారు గమనించాలని పేర్కొన్నారు. గుంటూరు, పెదపలకలూరు, పేరేచర్ల ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు గమనించి ఇతర రూట్లలో వెళ్లాలన్నారు.

రూ. 55 వేలు నగదు స్వాధీనం

తాడికొండ, మే 2: ఎలాంటి బిల్లులు లేని రూ.55 వేల నగదును ఎన్నికల స్క్వాడ్ స్వాధీనం చేసుకొని పోలీసులు గురువారం అప్పగించారు. కృష్ణ జిల్లా గన్నవరంనకు చెందిన చిర్రి వెంకటప్పరెడ్డి తాడికొండ నుంచి తన సొంత ఊరికి బైక్‌పై వెళ్తున్నారు. కంతేరులోని డక్కన్ టూబాకో కంపెనీ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సందర్భంగా వెంకటప్పరెడ్డి వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి బిల్లులులేని రూ.55 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

1791 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 2: స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో గురువారం జరిగిన వేలంలో 1791 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,000 గరిష్ఠధర రూ.15,300 మోడల్ ధర రూ.14,475 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,000 గరిష్ఠధర రూ.15,350, మోడల్‌ధర రూ.14,475 పలికాయి.

9వ పేజీ తరువాయి

కొలకలూరులో టీడీపీ కార్యాలయం ప్రారంభం

తెనాలి రూరల్, మే 2: మండలంలోని కొలకలూరులో టీడీపీ కార్యాలయాన్ని పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం ప్రారంభించి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. గ్రామంలో నెలకొని ఉన్న పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారి అభ్యున్నతికి ప్రత్యేక ఆలోచనతో ముందుకు సాగుతామన్నారు. అందరూ ప్రశాంతంగా జీవించేలా అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండేలా పాలన సాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

5న రెండు కేంద్రాల్లో నీట్ పరీక్ష

తెనాలి అర్బన్, మే 2: నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ నీట్ పరీక్ష ఈ నెల 5న ఆదివారం రెండు కేంద్రాల్లో జరుగుతుందని కో-ఆర్డినేటర్ టీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్ బెర్రీ స్కూల్, వివేకానంద సెంట్రల్ స్కూల్స్‌లో పరీక్ష జరిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 337మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని, 1.30 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరని చెప్పారు. 2 గంటల నుంచి 5.20 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎంపిక చేసిన వారి ద్వారా పరీక్షా కేంద్రాల్లో తనిఖీ, రిజిస్ట్రేషన్, సీసీ కెమెరా పర్యవేక్షణ ఉంటుందన్నారు. అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఒక పోస్టుకార్డు సైజు ఫొటో ప్రభుత్వ గుర్తింపుపత్రం, వాటర్ బాటిల్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. పరీక్ష రాసేందుకు పెన్ను కేంద్రంలోని ఇవ్వబడుతుందని, సాధారణ దుస్తులు ధరించి రావాలని, ఆభరణాలు, వాచ్‌లు, మందపాటి చెప్పులు, బూట్లు, పెద్ద గుండీలు ఉన్న దుస్తులు ఉండకూడదన్నారు.



పుట్టిన రోజు కేక్‌ను కట్‌చేస్తున్న నాదెండ్ల మనోహరం, మనోహర్ తదితరులు

ఘనంగా నాదెండ్ల మనోహరం జన్మదినం

తెనాలి రూరల్, మే 2: జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి నాదెండ్ల మనోహరం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో మనోహరం జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా తయారుచేయించిన కేక్‌ను నాదెండ్ల మనోహర్, మనోహరం కలిసి కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాదెండ్ల మిథుల్, జనసేన నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో తాగునీరు ఏర్పాటు చేయండి

● సీపీఎం నాయకుడు శివసాంబిరెడ్డి

తెనాలి, మారీసుపేట మే 2: పట్టణంలో పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో తాగునీరును ఏర్పాటుచేసి పాదచారుల దాహార్తిని తీర్చాలని సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు చలివేంద్రంలో తాగునీరు పెట్టడంగాని, మనిషిని ఏర్పాటు చేయకపోవడంలోని ఆంతర్యం ఏమటని ప్రశ్నించారు. ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్నారని, రోజు వందలాది మంది ప్రయాణికులు తాగునీరు దొరకక డబ్బుపెట్టి కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ సుబ్రహ్మణ్యం, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట మే 2: స్థానిక నాజరుపేటలోని మనఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గురువారం అన్నదాత సుఖీభవ సభ్యులు ధూళిపూడి వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు, కోడలు ధూళిపూడి శ్రీరామమూర్తి, పద్మ దంపతుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

తెనాలి క్రైం, మే 2: బైక్‌పై తరలిస్తున్న అక్రమ మద్యం బాటిళ్ళను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి పావర్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. స్థానిక వైకుంఠపురం బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ బైక్‌పై గోనె సంచిలో 48మంది మద్యం బాటిళ్ళను తీసుకువెళుతున్న వ్యక్తిని సిబ్బంది అదుపులోకి తీసుకుని కేసును సెబ్ అధికారులకు బదిలీ చేశారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 2: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. గురువారం అన్నదాత సుఖీభవ సభ్యులు ఎం.వెంకటేశ్వరావు, శారదాంబ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు మున్నంగి మల్లికార్జున శర్మ, నాగలక్ష్మి దంపతులు మరియు దిట్టకవి ఉమాశంకర్ వర్ధంతి సందర్భంగా వారి భార్య చరిత, కుమారుడు, కుమార్తె అక్షయ్, శ్రీదేవిల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



వెంకటాచలపతిని సత్కరిస్తున్న నృత్య గురువులు

కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ కార్యదర్శికి సత్కారం

తెనాలి అర్బన్, మే 2: కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శికి వేదాంతం వెంకటచలపతిని నృత్య గురువులు గురువారం ఘనంగా సన్మానించారు. కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవ వేడుకలను ఆమె ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. కూచిపూడి పతాక స్థాపాన్ని కూచిపూడి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అన్ని కూచిపూడి నాట్య రీతులు ఈ పతాక నీడలో వసుధైక కుటుంబం కావాలని ఆమె పిలుపునిచ్చారు. నృత్య గురువులు భాస్కర రంగనాయకి, నిర్మలా రమేష్, శ్రీరామచంద్రమూర్తి, వెంకటలక్ష్మి, చల్లా బాలత్రిపురసుందరి, వసంత దుర్గ, జ్యోతి, కన్నా, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రజకులకు అండగా నిలుస్తాం

ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని, నాదెండ్ల



రజకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, మే 2: రజకుల కుటుంబాలకు అండగా నిలుస్తామని వారి అభ్యున్నతికి ఉమ్మడి కూటమి ప్రణాళికతో ముందుకు వెళతామని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో నియోజవర్గ రజక సంఘీయులతో ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో రజకసోదరులకు అండగా నిలిచేలా పలు పథకాలను పొందుపర్చామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తును కాపాడుకునేందుకు రజక సంఘీయులందరూ ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించాలన్నారు. తెనాలిలో రజక సంఘీయులకు కమ్యూనిటీ హాలు, రజకుల రక్షణకు ప్రత్యేక చట్టం, బీసీ స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ కావాలని, నూతన టెక్నాలజీని జోడించిన పనిముట్లు వంటివి రజకులకు అందించాలని వేదికపై సభాధ్యక్షుడు పణిదపు దుర్గ ఉమ్మడి అభ్యర్థులను కోరారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సాధ్యమైనంత త్వరలో వాటిని నెరవేరుస్తామని ఉమ్మడి అభ్యర్థులు వారికి హామీ ఇచ్చారు. రజక సంఘీయులమంతా ఉమ్మడి ప్రభుత్వంవైపే ఉన్నామని వారి గెలుపులో భాగస్వాములమవుతామని ఐక్యత చాటుతో సభావేదికపై చేతులు కలిపారు. ఎమ్మెల్సీ దువ్వాడపు రామారావు, సీహెచ్ విజయ్, మునిపల్లి దుర్గ ప్రసాద్, చాట్రగడ్డ ఆంజనేయులు, అంకమ్మరావు, పెసర్లంక శ్రీను, మునిపల్లి రామకృష్ణ, చట్టు వెంకటేశ్వరి, ఎం.శ్రీరామమూర్తి, బాబురావు, నియోజవర్గంలో రజక సంఘీయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామారావుకు సత్కారం

తెనాలి రూరల్, మే 2: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావుకు ఆత్మీయ సత్కారం లభించింది. తెనాలి రజక ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, రాష్ట్ర రజక సాధికార కమిటీ డైరెక్టర్ మునిపల్లి వెంకటదుర్గాప్రసాద్, రైతు అధ్యక్షుడు గుమ్మడి ప్రసాద్, కొడాలి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి కె.సత్యనారాయణ, కాకుమాను అంకమ్మరావు తదితరులు ఎమ్మెల్సీని దుశాలువాలతో సత్కరించారు. పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుకుందాం..

తెనాలి రూరల్, మే 2: వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని రాష్ట్రాన్ని ఉమ్మడి పార్టీల నాయకత్వంలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకుందామని తద్వారా భావితరాల భవిష్యత్తుకు భరోసాగా నిలుద్దామని ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని రత్నాపార్క్వ్యూ అపార్టుమెంట్ వాసులతో పెమ్మసాని చంద్రశేఖర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా అభివృద్ధి చెంది యువతకు మన ప్రాంతంలోనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ దిగజారిపోయాయని అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: నాదెండ్ల

తెనాలి రూరల్, మే 2: రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయమానికి సూపర్‌సిక్స్ పథకాలతో వార్డుల్లో ప్రచారం ముమ్మరం చేయాలని జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో తెనాలి 24, 33వ వార్డులకు చెందిన వైసీపీ సానుభూతిపరులు ఆ పార్టీని వీడి నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. వారికి మనోహర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాదెండ్ల మనోహరం, రాజ్యలక్ష్మి

జనసేనలో పలువురి చేరిక

తెనాలి రూరల్, మే 2: పట్టణాలకు దీటుగా గ్రామాలను తీర్చిదిద్దుకుందామని ఉమ్మడి పార్టీల అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకునేలా గ్రామస్థాయిలో ప్రచారం ముమ్మరం చేయాలని జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని హాఫ్‌పేటకు చెందిన పలువురు వైసీపీ శ్రేణులు తెనాలి జనసేన కార్యాలయంలో నాదెండ్ల మనోహర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మనోహర్ జనసేన కండువాలుకప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన, టీడీపీ, బీజేపీ మేనిఫెస్టోను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మనోహర్ వారికి సూచించారు.

మనోహరం, రాజ్యలక్ష్మిల ప్రచారం

తెనాలి రూరల్, మే 2: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్‌ను ప్రజలందరూ ఓట్లు వేసి ఆశీర్వదించాలని నాదెండ్ల మనోహర్ సతీమణి మనోహరం, పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మిలు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మనోహరం, రాజ్యలక్ష్మిలు పట్టణంలోని 22వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సంగంజాగర్లమూడిలో ప్రచారం

తెనాలి రూరల్, మే 2: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని సంగంజాగర్లమూడిలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజుగ్లాసు గుర్తుపై ఓటువేయాలని, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించి కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనసేన పార్టీ అధికార ప్రతనిధి పగడాల శివపార్వతి, ఎంపీటీసీ వెంకటనరసమ్మ, గ్రామ ఉపసర్పంచ్ శివపార్వతి, టీడీపీ నాయకులు కొత్త రమేష్‌బాబు, సాయికృష్ణ, యార్లగడ్డ సత్యనారాయణ, కనకయ్య పలువురు కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంగలకుదురులో...

తెనాలి, మారీసుపేట మే 2: రానున్న ఎన్నికలలో రాష్ట్రాభివృద్ధి కోసం, గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ నాయకుడు కనగాల నాగభూషణం అన్నారు. మండల పరిధిలోని అంగలకుదురులో గురువారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలసి కూటమి పార్టీల మ్యానిఫెస్టో పత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం మాట్లాడుతూ ముందుచూపు, విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడును మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నప్పుడే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, వార్డు మెంబర్లు జాలాది దుర్గాభవాని, చెన్నుపాటి తేజస్వి, ఐనంపూడి పార్వతి, వాసుదేవనాయుడు, కడియాల కిషోర్, ముప్పవరపు సాంబశివరావు, ఉరిటి శ్రీనివాసరావు, గడే శ్రీను, కృష్ణ, ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి ఎన్డీఏ కూటమితోనే సాధ్యం: ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మే 2: రాష్ట్ర ప్రగతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చింతలపూడిలో నరేంద్ర కుమార్ సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామానికి చెందిన ఎంపీటీసీ చెరుకూరి అశ్వినీకుమార్, సజ్జా రమేష్‌బాబు ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మండల పరిధిలోని పెదపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొత్తూరు శ్యామ్‌బాబు, కంచర్ల రమేష్‌బాబు, మల్లంపాటి ధనేష్, ముద్రబోయిన తిరుపతయ్య, పోతురాజు, నూతి వెంకట్రావు, జున్న శ్రీనివాసరావు, జూటు శ్రీనివాసరావు, వేల్పూరి పాపారావు, ముద్రబోయిన శ్రీమన్నారాయణ, గణపతి, పొన్నూరు నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే పట్టణంలోని 2, 3 వార్డులకు చెందిన కలకండ సామ్రాజ్యం, నామాల గోపమ్మ, కొండా పార్వతి, ఎదురుబోయిన విజయ, అంబటి మంగమ్మ, వీర్నాల పద్మావతి, రాధిక, లక్ష్మీనందిని, వేల్పాల్టి లక్ష్మీకాంతమ్మ, మనుబ్రోలు మణమ్మ, రాయపూడి జ్యోతి, తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. దోపిడీ తప్ప, పాలన ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ప్రజలు తెలుగుదేశం కూటమి వైపు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులైన తనను, ఎంపీగా డాక్టర్ చంద్రశేఖర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల తలరాతను మార్చే కూటమి మ్యానిఫెస్టోను ప్రజల వద్దకు తీసుకువెళ్లి తెలియజెప్పాలని నరేంద్రకుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధూళిపాళ్ల నరేంద్రతో టీడీపీలో చేరిన దొప్పలపూడి ఎంపీటీసీ చెరుకూరి అశ్విని కుమార్ తదితరులు



చింతలపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధూళిపాళ్ళ జ్యోతిర్మయి

జ్యోతిర్మయి ప్రచారం

పొన్నూరుటౌన్, మే2: రాష్ట్రంలో మహిళా సాధికారత కూటమి విజయంతోనే సాధ్యం అని డివిసి హాస్పటల్ ఎండి ధూళిపాళ్ళ జ్యోతిర్మయి అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో గురువారం 2వ రోజు కూటమి అభ్యర్థుల విజయానికి జ్యోతిర్మయి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంచిపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు జరిగే ప్రయోజనాల గురించి వివరించారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా కూటమి హామీలు ఉన్నాయన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడ గ్యాస్ సిలెండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500, తల్లికి వందనం పేరుతో చదువుకునే బిడ్డలకు రూ. 15 వేలు అందించనునట్లు చెప్పారు. మహిళలకు అండగా నిలిచే కూటమి అభ్యర్థులను గెలిపించాలని జ్యోతిర్మయి విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబటి కులాల ప్రస్తావనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

● కోడ్ ఉల్లంఘనపై టీడీపీ తీవ్ర అభ్యంతరం

పొన్నూరు టౌన్, మే 2: పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల ప్రచారంలో పదే పదే కోడ్ ఉల్లంఘనకు పాల్పడటం, కులాల ప్రస్తావన తీసుకురావటంపై తెలుగుదేశం పార్టీ గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్ల రామయ్య ఫిర్యాదులను ఎన్నికల సంఘానికి అందచేశారు. పొన్నూరు వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగిన అంబటి మురళీకృష్ణ తన సామాజికవర్గాన్ని కేంద్రంగా చేసుకొని విజయం సాధించాలని కుల విద్వేష రాజకీయాలకు తెరతీసారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన వాడుతున్న సామాజిక వర్గాల ప్రస్తావన తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. ఇటీవల వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రచార సభలో బహిరంగ సభా వేదికగా అంబటి సామాజికవర్గాల ప్రస్తావన తెచ్చాడు. ఆ తర్వాత కూడా కొండమూది, వడ్డిముక్కల గ్రామాలో ఈ ప్రస్తావనను కొనసాగించాడు. పొన్నూరులో తన సామాజికవర్గం ఓటర్లు 40వేలు ఉన్నాయని తన ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ళ సామాజిక వర్గం ఓటర్లు 20 వేలే ఉన్నారని తాను ఫుల్ టికెట్ నని, ధూళిపాళ్ళ హాఫ్ టికెట్ అని మాట్లాడారు. తన సామాజికవర్గం ఓట్లు అని తనకే వేస్తారని, అలాగే జనసేన ఓట్లు ఒకటి కూడా టీడీపీకి పడవు అని సామాజిక వర్గ ప్రాతిపదికగా మైండ్‌గేమ్‌కు ప్రయత్నించారు. అలాగే ఎవరిచేతిలో ఓడినా తనకు బాధలేదని ధూళిపాళ్ళ సామాజిక వర్గం చేతిలో ఓడిపోకూడదని అంబటిచేసిన వాఖ్యలు ప్రశాంతమైన పొన్నూరు పల్లెటూర్లలో కక్షలు, కార్పణ్యాలు పెంపొందించేలా ఉండటమే కాకుండా కుల విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని పలువర్గాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి అనుకూలంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలలో కూడా అంబటి వాఖ్యలు వ్యతిరేకతను నింపుతున్నాయి. అంటే కేవలం తన సామాజికవర్గం ఓట్లు పడితే చాలు, ఇతరవర్గాల ఓట్లు అవసరం లేదని అంబటి భావిస్తున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సొంత పార్టీ నుంచే అంబటి వాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తం అవటంతో వైసీపీ శ్రేణులు ఆలోచనలోపడ్డారు. గెలవక ముందే సొంత సామాజికవర్గం గురించి మాట్లాడుతున్న అంబటి విజయం సాధిస్తే ఇతర సామాజికవర్గాలపై ఎటువంటి ఆదరణ చూపుతారోననే మీమాంశ తలెత్తుతోంది. తన సామాజికవర్గం ఓట్లు అని తనకే వేస్తారని, అలాగే జనసేన ఓట్లు ఒకటి కూడా టీడీపీకి పడవు అని సామాజిక వర్గ ప్రాతిపదికగా మైండ్ గేమ్ ఆడేందుకు ప్రయత్నించారు. అలాగే ఎవ్వరి చేతిలో ఓడినా తనకు బాధ లేదని ధూళిపాళ్ళ సామాజికవర్గం చేతిలో ఓడిపోకూడదని అంబటి చేసిన వాఖ్యలు ప్రశాంతమైన పొన్నూరు పల్లెటూర్లలో కక్షలు, కార్పణ్యాలు పెంపొందించే విధంగా ఉండటమే కాకుండా కుల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని రాజకీయ పరిశీలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపికి అనుకూలంగా ఉండే ఎస్సి, ఎస్టీ, మైనార్టీ, బిసి వర్గాలో కూడా అంబటి వాఖ్యలు వ్యతిరేఖతను నింపుతున్నాయి. అంటే కేవలం తన సామాజికవర్గం ఓట్లు పడితే చాలు, ఇతర ఓట్లు అవసరం లేదని అంబటి ఉదేశంగా ఉందని ఇతర సామాజిక వర్గం అభిప్రాయ పడుతున్నారు. సొంత పార్టీ నుంచే అంబటి వాఖ్యల పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. గెలవక ముందే సొంత సామాజికవర్గం గురించి మాట్లాడుతున్న అంబటి విజయం సాధిస్తే ఇతర సామాజికవర్గాలపై ఏమి అభిమానం చూపుతారోనని అనుమానపడుతున్నారు. జనసైనికులు పవన్‌కల్యాణ మద్దతు ఇస్తున్న టీడీపీ అభ్యర్థిని కాదని వైసీపీ ఎలా ఓటు వేస్తామని ప్రశ్నిస్తున్నారు. మురళి వాఖ్యలపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్ల రామయ్య ఎన్నికల కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నరేంద్ర కుమార్, వర్ల రామయ్య అందచేసిన ఫిర్యాదులను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముకేష్ కుమార్ మీనా ఫిర్యాదులను పరిశీలించి టీడీపీ నేతలు లేవనెత్తిన అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు హామీ ఇచ్చారు. కుల విద్వేషాలు రగల్చటం మాని ఎన్నికల క్షేత్రంలో పోరాడాలని అంబటికి పలువురు సూచిస్తున్నారు.



వార్డులో పర్యటిస్తున్న టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ముస్లింల ప్రచారం

పొన్నూరు టౌన్, మే 2: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కూటమి పార్టీలు చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అందించనున్నాయని జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తెలిపారు. గురువారం పట్టణంలోని 27, 28 వార్డులో ముస్లింలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మైనార్టీలకు జరిగే లబ్ధిని వివరించారు. 50ఏళ్లకే ముస్లింలకు పెన్షన్ వస్తుందని ఈద్గా, ఖబరస్తాన్ స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. దుల్హన్ పథకాన్ని రూ. లక్షకు పెంచనున్నట్లు చెప్పారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం యువత ఆర్థికాభివృద్ధి చెందేందుకు రూ.5లక్షల వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మసీదులకు నిధులు, హజ్ యాత్రికులకు ఆర్థికసాయం, మౌజన్ల, ఇమాముల వేతనాలు పెంపు, హజ్‌హౌస్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు చెప్పారు. వైసీపీ దగాకోరు మాటలు నమ్మకుండా కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలు వార్డులకు చెందిన టీడీపీ, జనసేన ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

యువకుడిపై రౌడీషీటర్ దాడి

తెనాలి అర్బన్, మే 2: స్థానిక ఐతానగర్‌లో బుధవారం రాత్రి జరిగిన గొడవలో అడ్డువచ్చిన వ్యక్తిపై రౌడీషీటర్ దాడిచేసిన సంఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. లింగారావు సెంటర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా అందులో ఒక ద్విచక్ర వాహనదారుని దాడిచేసి కొడుతున్న రౌడీషీటర్ సముద్రాల పవన్‌ను అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అడ్డుచెప్పాడు. దీంతో ఆ యువకునిపై దాడి చేశాడు. బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ నెల 30న పీసీఆర్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు విధి నిర్వహణ నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డుపై అడ్డంగా ఉన్న యువకుడిని మందలించాడు. ఆ యువకుడు బండిమీద వచ్చి వెనుకగా ఏఎస్ఐ వాహనాన్ని నెట్టి కిందపడేసి పారిపోయాడు. ఆ యువకుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బీసీలను అణగదొక్కిన వైసీపీ: తాడిశెట్టి మురళి

పొన్నూరు టౌన్, మే 2: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ బీసీలను అణగదొక్కిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాడిశెట్టి మురళి ఆరోపించారు. మండల పరిధిలోని గోళ్ల మూడిపాడు, ఉప్పరపాలెం గ్రామాల్లో గురువారం ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాడిశెట్టి మురళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాలో రోడ్‌షోచేసి ఆత్మీయ సమావేశాలు జరిపారు. తాడిశెట్టి మురళి మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో బీసీలకు వైసీపీ చేసింది శూన్యం అన్నారు. బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్భాటం ప్రచారం చేసారని ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలకు గుర్తింపు లభించిందన్నారు.



గోళ్లమూడిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నరేంద్ర కుమార్, తాడిశెట్టి మురళి

'వైసీపీ హయాంలో దళితులకు తీవ్ర అన్యాయం'

తెనాలి రూరల్, మే 2: వైసీపీ హయాంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని సమతాసైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వరరావు ఆరోపించారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ దళితుల పక్షపాతి నంటూ చెప్పుకుని వారిపైనే దాడులకు తెగబడుతూ, సంక్షేమ పథకాలను నిర్వీర్యంచేసి దళితుల ద్రోహిగా జగన్‌మోహన్ రెడ్డి నిలిచారన్నారు. దళితవాడలను గంజాయి కేంద్రాలుగా మార్చారన్నారు. దళితుల కోసం టీడీపీ ప్రవేశపెట్టిన 27 పథకాలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రక్షణకూడా లేకుండా పోయిందని రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. దళితులు ఐక్యంగా రాష్ట్రానికి, ప్రజలకు మంచి చేసే ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనతా సైనిక్‌దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ జియాజి షణింద్రకుమార్ పలువురు దళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు గోవతోటి రాంబాబు మృతి

పొన్నూరు టౌన్, మే 2: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు 22వ వార్డు పార్టీ అధ్యక్షుడు గోవతోటి రాంబాబు బుధవారం రాత్రి మృతిచెందాడు. గత నెల 24వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాంబాబు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఎనౌన్స్‌మెంట్ రాంబాబుగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి అనుచరుడిగా పాత పొన్నూరు ఎస్సీ కాలనీలో కీలక నాయకుడిగా గుర్తింపుపొందారు. నరేంద్రకుమార్ వెన్నంటి 30ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. రాంబాబు మృతికి మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సంతాపం తెలిపారు. గురువారం టీడీపీ నేతలు రాంబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.